


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 279 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ ఆదివారం 16 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 279 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SUN 16 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla, Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## తెలంగాణను విధ్వంసంనుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం

- గోల్కొండలో జాతీయ జెండాను ఎగురవేసిన సీఎం రేవంత్ రెడ్డి
- ఆయుధం లేకుండా అహింసతో స్వాతంత్ర్యం సాధించామని వ్యాఖ్య
- దెబ్బతిన్న వ్యవస్థలను32 నెలల్లో గాడిలో పెట్టామని ప్రకటన
- తెలంగాణ తలసరి ఆదాయం దేశం కంటే 91 శాతం అధికమని వెల్లడి
- రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని సీఎం వ్యాఖ్య
- బలమైన ప్రజాస్వామిక భారత్ నిర్మాణానికి పిలుపు

- మిగతా 2లో





## లోక్ భవన్ లో గవర్నర్ ఎట్ హోం..హాజరైన ప్రముఖులు



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో ఘనంగా గవర్నర్ ఎట్ హోం కార్యక్రమం నిర్వహించారు. ఈ తేనీటి విందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజకీయ పార్టీల నేతలతో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ వేడుకకు శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌తో పాటు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. అలాగే ప్రతిపక్ష పార్టీ

- మిగతా 2లో




# సప్తధార.. సంకల్పం

..ఇదే అభివృద్ధికి దిక్సూచి







ప్రధాని మోదీ సరికొత్త నినాదం

## జెన్‌జీకి అధిక ప్రాధాన్యం

- 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్
- యావత్ ప్రపంచం ముందు మనకున్న సవాల్ ఇదే
- 140 కోట్ల మంది పౌరుల కృషి, ప్రయత్నంతో లక్ష్యాన్ని చేరుతాం.
- భారత్ ధైర్యానికి నిదర్శనంగా నిలవాలి
- 80వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం హైలైట్స్

వికసిత్ భారత్-2047 లక్ష్యసాధనకు ఏడు రంగాలే అభివృద్ధికి సప్తధారలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో 'సప్తధార శక్తి' పేరుతో ఉత్పాదకత నుంచి వ్యవసాయం, సాంకేతికత నుంచి రక్షణ, గ్రీన్ ఎనర్జీ నుంచి సాంస్కృతిక ప్రభావం వరకు ఏడు కీలక రంగాలపై దేశ భవిష్యత్ నిర్మాణాన్ని కేంద్రీకరిస్తున్నట్లు వెల్లడించారు. యువశక్తినే ఈ మార్పునకు ప్రధాన చోదకశక్తిగా పేర్కొంటూ.. 2047 నాటికి భారతన్ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

ఉత్పాదక రంగం వ్యవసాయ, ఆహార భద్రత సాంకేతికత, ఆవిష్కరణలు ఇన్ఫ్రాస్ట్రక్టర్, కనెక్టివిటీ శక్తి రక్షణ శక్తి గ్రీన్ ఎనర్జీ కల్చర్ ఇన్ఫ్లూయెన్స్, సాఫ్ట్ పవర్
ఈ ఏడు రంగాలు కలిసికట్టుగా పని చేసినప్పుడే 2047 నాటికి వికసిత్ భారత్ కల సాకారం అవుతుంది..
-నరేంద్ర మోదీ, భారత ప్రధాని

మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ చేసి క్రెడిట్ తీసుకోండి
-విపక్షాలకు ప్రధాని మోదీ పిలుపు

వివరాలు 2లో..

## వికసిత్ భారత్..

2047 లక్ష్యంగా దూసుకెళ్తున్న దేశం

- యువతే... భారత్ బలం
- ఏడాదిలో కోటి మందికి ఏఐ శిక్షణ
- ప్రపంచ ఏఐ నాయకత్వం దిశగా భారత్
- 12 ఏళ్లలో ఆర్థిక శక్తిగా ఎదిగాం
- 2.5 లక్షలకు పైగా స్టార్టప్లు
- నక్సలిజంపై ఉక్కుపాదం




## వందేమాతరం గానంతో.. పులకించిన ఎర్రకోట

ముువ్వన్నెల జెండాతో ఉప్పొంగిన దేశభక్తి

- 13వసారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మోదీ
- ఆకాశం నుంచి పూలవాన.. స్వదేశీ ఫిరంగుల మోత
- కెప్టెన్ సోనియా చౌహాన్ నేతృత్వంలో త్రివిధ దళాల వందనం
- జ్ఞానపథంలో 2500 మంది కెడెట్ల అద్భుత ప్రదర్శన
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

## ఫామ్‌హౌస్‌లో కాదు.. అసెంబ్లీలోకి రా..
# కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్




- కేసీఆర్‌కు రేవంత్ అసెంబ్లీ సవాల్
- రైతుల అంశంపై చర్చకు పిలుపు
- ఫామ్‌హౌస్‌లో ఉండి విమర్శలు వద్దన్న సీఎం
- బీఆర్ఎస్, బీజేపీపై విమర్శలు
- సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల ప్రారంభం

- మిగతా 2లో

# 22ఏ పేరుతో భారీ దోపిడీ జరుగుతోంది

- నిషేధిత భూముల ముసుగులో భారీ దోపిడీ జరుగుతోందన్న బండి సంజయ్
- ఏకంగా 95 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారని ప్రశ్న
- ప్రభుత్వం వేలం వేసిన భూములను కూడా ఈ జాబితాలో చేరుస్తున్నారని విమర్శ



- మిగతా 2లో



## ట్వీట్లతోనో, స్పీచ్ లతోనే ఆక్రమించలేరు..

### హార్మూజ్ జలసంధి ఇరాన్‌దే: ట్రంప్ ప్రకటనపై ఇరాన్ కౌంటర్

- హార్మూజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానన్న ట్రంప్
- ట్రంప్ వ్యాఖ్యలపై మండిపడ్డ ఇరాన్ మంత్రి కాజెమ్ గరీబాబాడీ
- హార్మూజ్ పై పూర్తి నియంత్రణ తమ చేతుల్లోనే ఉంటుందని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:అంతర్జాతీయ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిపై అమెరికా, ఇరాన్ దేశాల మధ్య మాటల యుద్ధం ఒక్కసారిగా తీవ్రరూపం దాల్చింది. ఇరాన్‌తో జరుగుతున్న పోరులో విజయం సాధించిన అనంతరం హార్మూజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

- మిగతా 2లో

# అది మా గొంతును అణచివేసే ప్రయత్నమే



పెన్ పవర్ డెస్క్:కాక్రోచ్ జనతా పార్టీ అధి కారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా శనివారం ఉదయం కొద్దిసేపు నిలిచిపోయింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున తమ గొంతును అణచివేసే ప్రయత్నం జరిగిందని ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. ఉదయం 6.16 గంటలకు ఖాతా తొలగించారని ఎక్స్‌లో ఆయన పోస్టు చేశారు.

- మిగతా 2లో

# చిన్న తప్పు కూడా పెద్ద నష్టం కలిగిస్తుంది

### ఇంటర్న్‌లకు నిర్మలా సీతారామన్ కీలక సందేశం

- ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ కింద పనిచేస్తున్న ఇంటర్న్‌లతో నిర్మలా సీతారామన్ సమావేశం
- ఏ పని చేసినా జాగ్రత్తగా, పరిపూర్ణంగా చేయాలని నిర్మల సూచన
- మనం చేసే తప్పు ఇతరులకు నష్టం కలిగించవచ్చన్న నిర్మల



- మిగతా 2లో

## అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రకృతి బీభత్సం..
# ఐదుగురు సైనికులు గల్లంతు

- అరుణాచల్ ప్రదేశ్‌లో రెండు వేర్వేరు విపత్తు ఘటనలు
- కొండచరియలు విరిగిపడి నలుగురు కూలీలు మృతి చెందినట్లు అనుమానం
- ఆకస్మిక వరదలో ఐదుగురు ఆర్మీ జవాన్లు గల్లంతు
- భారీ వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నష్టం



- మిగతా 2లో

# సప్తధార.. సంకల్పం

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసంగించారు. దేశం సరికొత్త సంకల్పంతో ముందుకు సాగుతోందని చెబుతూ, 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక రోజున స్వాతంత్ర్య సమరయోధులకు, విప్లవకారులకు, మహాత్మా గాంధీకి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "ఇదొక చారిత్రాత్మక దినం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎర్రకోట ప్రాకారాల నుంచి 'వందేమాతరం' గీతం వినిపించడం ఇదే ప్రథమం. ఈ రోజు ప్రతి ఒక్కరి హృదయంలో వందేమాతరం ప్రతిధ్వనిస్తోంది. ప్రతి ఇంట్లో మువ్వన్నెల జెండా ఎగురుతోంది, ప్రతి మదిలోనూ త్రివర్ణ పతాకం నిలిచి ఉంది" అని అన్నారు.

దేశ ఆర్థిక ప్రగతిని వివరిస్తూ.. "ఒకప్పుడు మనల్ని 'ఫ్రాజైల్ ఫైవ్' (అతి బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థలు) దేశాల్లో ఒకటిగా లెక్కించేవారు. కానీ, కేవలం 12 ఏళ్లలోనే ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. గడిచిన 12 ఏళ్లుగా ప్రతి ఒక్కరూ దేశాన్ని అభివృద్ధి పథంలో నిలపడానికి కృషి చేస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం భారత్ పెద్ద కలలే కన్నది, కానీ ఆశించిన వేగంతో ప్రగతి సాధించలేకపోయాం. ఈ రోజు భారత్ అపూర్వమైన వేగం, ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకెళతోంది. ఇప్పుడు 140 కోట్ల భారతీయుల సంకల్పాన్ని ఏ శక్తీ ఆపలేదు" అని మోదీ ఉద్ఘాటించారు. భవిష్యత్ లక్ష్యాలపై మాట్లాడుతూ.. "మన కలలు, సంకల్పాలు పెద్దవిగా ఉండాలి. అప్పుడే మన సామర్థ్యాలు ఉన్నత శిఖరాలకు చేరుతాయి. భారత్ సరికొత్త శిఖరాలను అధిరోహించడానికి పెద్ద కలలు కంటోంది. 2047 నాటికి దేశం అభివృద్ధి చెందేలా నేను చూస్తాను. అత్యధిక జనాభా కలిగిన దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారినప్పుడు, ప్రపంచం మనల్ని కచ్చితంగా భిన్నంగా చూస్తుంది" అని ప్రధాని పేర్కొన్నారు.

ఇటీవల దేశంలోని కొన్ని ప్రాంతాల్లో సంభవించిన వరదలు, కొండచరియలు విరిగిపడటం వల్ల నష్టపోయిన కుటుంబాల బాధను తాను అర్థం చేసుకోగలనని, వారికి యావత్ దేశం అండగా నిలుస్తుందని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు.

**'సప్తధార'.. భారత్ అభివృద్ధికి మోదీ మాస్టర్‌ప్లాన్ ఇదే!**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ భవిష్యత్ అభివృద్ధికి కీలకమైన ఏడు రంగాలను 'శక్తి సప్తధార'గా అభివర్ణించారు. దేశాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చడంతో పాటు అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ఈ ఏడు శక్తులను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎర్రకోట నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన మోదీ.. తయారీ రంగం, రైతులు, సాంకేతికత, గతిశక్తి, రక్షణశక్తి, హరిత ఇంధనం, సాఫ్ట్ పవర్‌ను భారత్ బలాలుగా పేర్కొన్నారు. ఈ రంగాల్లో వేగంగా ముందుకు సాగితే దేశ వృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందని చెప్పారు.

**1. తయారీ రంగం:** భారత్ భవిష్యత్ వృద్ధికి తయారీ రంగమే కీలకమని మోదీ అన్నారు. విడిభాగాలతో పాటు పూర్తి ఉత్పత్తులను దేశంలోనే తయారు చేయాలని సూచించారు. నాణ్యత, తక్కువ ఖర్చు, భారీ ఉత్పత్తితో ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్ కీలకంగా మారాలని పిలుపునిచ్చారు.

**2. రైతులు:** వ్యవసాయం, ఆహార శుద్ధి రంగాలకు మరింత ఊతమివ్వాలని ప్రధాని చెప్పారు. భారత రైతులకు ప్రపంచ మార్కెట్లు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో ఎగుమతులను పెంచాలని సూచించారు. చిరుధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్లు, కూరగాయలను ప్రపంచ బ్రాండ్లుగా మార్చాలని అన్నారు.

**3. సాంకేతికత:** కొత్త సాంకేతికతలు, డేటా సెంటర్లు, రోబోటిక్స్‌లో భారత్ ప్రపంచ కేంద్రంగా ఎదగాలని మోదీ ఆకాంక్షించారు. యూపీఐతో భారత సామర్థ్యం ప్రపంచానికి తెలిసిందని చెప్పారు. దేశంలో తయారైన 6జీ సాంకేతికతను దేశవ్యాప్తంగా విస్తరించాలని సూచించారు.

**4. గతిశక్తి:** దేశంలో రవాణా, అనుసంధాన వ్యవస్థలను మరింత వేగవంతం చేయాలని మోదీ అన్నారు. కొత్త రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మెరుగైన మౌలిక వసతులతో వ్యాపారాలకు మరింత ఊతం లభిస్తుందని చెప్పారు.

**5. రక్షణశక్తి:** రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశంలోనే రక్షణ పరికరాల తయారీని పెంచాలని సూచించారు. డ్రోన్లు, డ్రోన్ నిరోధక సాంకేతికతలపై పెట్టుబడులు పెంచాలని అన్నారు.

**6. హరిత ఇంధనం:** హరిత ఇంధన రంగాన్ని భారత్ అభివృద్ధికి కీలక శక్తిగా మోదీ పేర్కొన్నారు. ఈ రంగంలో కొత్త ఆవిష్కరణలకు పెద్దపీట వేయాలని సూచించారు. భవిష్యత్ ఇంధన అవసరాలను తీర్చేందుకు హరిత ఇంధనంపై దృష్టి పెట్టాలని అన్నారు.

**7. సాఫ్ట్ పవర్:** యోగా, హస్తకళలు, సినిమాలు, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్ భారత్ సాఫ్ట్ పవర్‌ను పెంచుతాయని మోదీ చెప్పారు. సృజనాత్మక రంగాలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. పర్యాటక రంగంలోనూ భారత్‌కు ఉన్న అవకాశాలను మరింతగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

**నక్సలిజం అంతమైంది.. కానీ 'దిమాగీ నక్సల్స్' ఇంకా ఉన్నారు: మోదీ**

దేశంలో సాయుధ నక్సలిజం, మావోయిస్టు హింసను దాదాపుగా అంతం చేశామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అయితే మావోయిస్టు భావజాలం మాత్రం ఇంకా కొనసాగుతోందని హెచ్చరించారు. ఆ ఆలోచనా విధానంతో ఉన్న వారిని 'దిమాగీ నక్సల్స్'గా పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తులు అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని, సమాజంలో హింస, అశాంతిని ప్రేరేపించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. అడవుల్లో సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించడంలో ప్రభుత్వం విజయం సాధించిందని ప్రధాని చెప్పారు. దశాబ్దాలుగా దేశాన్ని వేధించిన ఈ సమస్య నుంచి ప్రజలకు విముక్తి కల్పించామని అన్నారు. అయితే సాయుధ నక్సల్స్ అంతమైనా వారి భావజాలం పూర్తిగా అంతం కాలేదని పేర్కొన్నారు. మావోయిస్టు ఆలోచనా విధానం ఉన్న కొందరు సంస్థలు, వ్యవస్థల్లోకి చొరబడి ప్రభావం చూపేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిని గుర్తించి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

2014లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజే దేశాన్ని నక్సలిజం నుంచి విముక్తి చేయాలని నిర్ణయించుకున్నామని మోదీ తెలిపారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు నక్సలిజం దేశంలోని అనేక ప్రాంతాలను తీవ్రంగా ప్రభావితం చేసిందన్నారు. యువత, కుటుంబాలు, భద్రతా బలగాలు ఈ హింసతో తీవ్రంగా నష్టపోయాయని చెప్పారు. తుపాకీ భయంతో ప్రజలను బందీలుగా మార్చిన పరిస్థితులు ఉండేవని, రాజ్యాంగ వ్యవస్థను బలహీనపరిచేందుకు మావోయిస్టులు ప్రయత్నించారని ఆరోపించారు. ప్రస్తుతం నక్సలిజం చివరి దశలో ఉందని, పూర్తిగా నిర్మూలించే దిశగా వేగంగా ముందుకు సాగుతున్నామని అన్నారు.

సాయుధ నక్సలిజంపై పోరాటంతోనే తమ పని పూర్తికాదని మోదీ స్పష్టం చేశారు. మావోయిస్టు భావజాలాన్ని వ్యాప్తి చేసే వ్యక్తులు హింస, అరాచకాన్ని ప్రోత్సహించేందుకు వివిధ మార్గాలను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. సమాజాన్ని తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించే ఇలాంటి వారిని గుర్తించి ఒంటరి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కూడా నక్సలిజం నిర్మూలనను ప్రశంసించారు. దశాబ్దాలుగా దేశానికి తీవ్ర సవాలుగా ఉన్న నక్సలిజాన్ని అంతం చేయడం గొప్ప విజయమని అన్నారు. గతంలో నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయని పేర్కొన్నారు. బస్తర్ ఒలింపిక్స్, బస్తర్ పండుగ వంటి కార్యక్రమాల్లో స్థానిక ప్రజల భాగస్వామ్యం పెరగడం మార్పునకు నిదర్శనమని తెలిపారు.

# తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం

గోల్కొండ కోటలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ చరిత్రలోనే ఆయుధం లేని యుద్ధం భారత స్వాతంత్ర్య పోరాటమని అన్నారు. అహింసతోనూ విజయాన్ని సాధించవచ్చని మహాత్మాగాంధీ నిరూపించారని చెప్పారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం జీవనానికి ఆధారమని, దానికి వెల కట్టలేమని గాంధీజీ చెప్పారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం ద్వారా దేశంలోని వివిధ రంగాల అభివృద్ధికి గత ప్రభుత్వాలు కృషి చేశాయని అన్నారు. తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛను అందించడంతో పాటు విధ్వంసకర పాలన నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. తెలంగాణ భవిష్యత్తుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేసుకుని ముందుకు సాగుతున్నామని వెల్లడించారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 32 నెలలు పూర్తయ్యాయని సీఎం తెలిపారు. దెబ్బతిన్న వ్యవస్థలను ఒక్కొక్కటిగా గాడిలో పెడుతున్నామని చెప్పారు. తమ సంక్షేమ పథకాలను కేవలం ఆర్థిక లెక్కలతో చూడటం లేదని స్పష్టం చేశారు. సంక్షేమంలో మానవీయత ఉందని, పేదల పట్ల బాధ్యత ఉందని అన్నారు. వారి జీవితాల్లో ఆనందం నింపాలన్న తపనతో కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఓట్ల కోసం లేదా మొక్కుబడిగా సంక్షేమాన్ని అమలు చేయడం లేదని స్పష్టం చేశారు.

32 నెలల్లో ప్రభుత్వం చేసిన కృషి ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ తలసరి ఆదాయం పెరగడం దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం 91 శాతం అధికంగా ఉందని చెప్పారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నది తమ ప్రభుత్వ నమ్మకమని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను సీఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాలని, పరస్పర గౌరవం, దేశభక్తి విలువలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. అసమానతలు లేని, శాంతి, సౌభ్రాతృత్వాలతో కూడిన బలమైన ప్రజాస్వామిక భారతదేశాన్ని నిర్మించడమే సమరయోధులకు నిజమైన నివాళి అని అన్నారు. ప్రతి పౌరుడికి సమన్యాయం, సమానత్వం, స్వేచ్ఛ అందేలా నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ కర్తవ్యనిష్ఠతో, అంకితభావంతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ఫామ్‌హౌస్‌లో కాదు.. అసెంబ్లీలోకి రా..

# కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మేలు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అన్యాయాలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని అన్నారు. ఫామ్‌హౌస్‌లో ఉండి విమర్శలు చేయడం కాదని, ప్రజల ముందుకు వచ్చి మాట్లాడాలని అన్నారు. సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు.

గతంలో వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లో మాత్రం వరి పండించారని రేవంత్ విమర్శించారు. ఇప్పుడు రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేపడుతుంటే బీఆర్ఎస్ విమర్శలు చేస్తోందన్నారు. రైతుల సంక్షేమంపై నిజమైన చర్చకు సిద్ధమైతే అసెంబ్లీ వేదికగా మాట్లాడుకుందామని సవాల్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్, బీజేపీ ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని రేవంత్ అన్నారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి బొమ్మా బొరుసులాంటివని వ్యాఖ్యానించారు. పదేళ్లు అధికారంలో ఉన్నా పేదలకు సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ కోతలు వస్తాయని గతంలో బీఆర్ఎస్ ప్రచారం చేసిందని, కానీ ఇప్పుడు రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేవని రేవంత్ చెప్పారు. రైతు భరోసా పథకం కింద 32 నెలల్లో రూ.36 వేల కోట్లు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నివేదికల ప్రకారం దేశంలో తక్కువ అప్పులు ఉన్న రైతులు తెలంగాణలోనే ఉన్నారని అన్నారు. బీజేపీ నేతలు ఆ నివేదికలు చదివితే నిజాలు తెలుస్తాయని వ్యాఖ్యానించారు.

స్మార్ట్ రేషన్ కార్డులు కేవలం ప్లాస్టిక్ కార్డులు కావని, పేదల ఆత్మగౌరవానికి గుర్తని రేవంత్ చెప్పారు. ఆకలి తీర్చే భరోసానే ఈ కార్డుల ఉద్దేశమని అన్నారు. పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు రేషన్ వ్యవస్థను తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు.

## లోక్ భవన్ లో గవర్నర్ ఎట్ హోం..హాజరైన ప్రముఖులు

- మొదటి పేజి తరువాయి

అయిన బీజేపీ నుంచి ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ తో పాటు బీజేపీ రాష్ట్ర ముఖ్య నేతలు ఈ తేనీటి విందులో పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఒక ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డితో బీజేపీ రాష్ట్ర చీఫ్ ఎన్. రామచందర్ రావు ఆత్మీయంగా షేక్ హ్యాండ్ ఇచ్చుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా, ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## ఎడిటర్ వ్యూ

# స్మార్ట్ రేషన్ కార్డుల్లోనూ రాజకీయమే.. ఇదెక్కడి గోల

తెలంగాణలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల ఫొటోలు ముద్రించడంపై తీవ్ర రాజకీయ వివాదం చెలరేగింది. కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం తీవ్రమయింది. స్మార్ట్ కార్డులపై రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు పెట్టుకుని ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో పెట్టకపోవడంపై బీజేపీ అభ్యంతరం తెలుపుతుంది. కేంద్ర ప్రభుత్వం పేదలకు ఐదు కిలోల ఉచిత బియ్యం ఇస్తుంటే ప్రధాని మోదీ ఫొటో ఎందుకు పెట్టలేదని బీజేపీ నేతలు మండి పడుతున్నారు. సన్న బియ్యం పంపిణీ చేస్తున్నది తెలంగాణ ప్రభుత్వమేనని, తమ ప్రభుత్వం పంపిణీ చేసే చోట కేంద్ర ప్రభుత్వం ఊసెందుకని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. దీంతో స్మార్ట్ రేషన్ కార్డుల వివాదం రెండు పార్టీల మధ్య మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**వివాదానికి కారణం ఫొటోలు ...**

కొత్త స్మార్ట్ రేషన్ కార్డులపై సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరుల ఫొటోలను ముద్రించడంతో వివాదం మొదలయింది. పేదలకు ఇస్తున్న ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్ర ప్రభుత్వమే ఉచితంగా ఇస్తున్నప్పటికీ, రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో ముద్రించకపోవడంపై బీజేపీ నేతలు బండిసంజయ్, కిషన్‌రెడ్డి, రఘునందన్ రావు, ధర్మపురి అర్వింద్ నిలదీయగా, కేవలం ఒక్క కిలో ఇచ్చే రాష్ట్ర నాయకుల ఫొటోలు మాత్రం ఎందుకున్నాయని విమర్శించారు. కేంద్ర నిధులతో ఇస్తున్న పథకంలో ప్రధాని ఫొటో ఉండాలని, మోదీ ఫొటో ముద్రించకుండా కార్డుల పంపిణీని తక్షణమే నిలిపివేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ వాదన ఇలా...**

ఫొటో పెట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా అందిస్తున్న సంక్షేమ పథకాలు, పారదర్శకత కోసం తెచ్చిన క్యూఆర్ కోడ్ విధానం తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రభుత్వ పెద్దల చిత్రాలు ముద్రించడంలో తప్పులేదని కాంగ్రెస్ వర్గాలు సమర్థించుకుంటున్నాయి. ఇందులో తప్పేముందని రాష్ట్రాలపై కేంద్ర పెత్తనమేంటని ప్రశ్నిస్తున్నారు. మరొకవైపు కేంద్రమంత్రి బండి సంజయ్ కాంగ్రెస్‌ది తుమ్మితే ఊడిపోయే ప్రభుత్వమన్న బండి సంజయ్ ప్రభుత్వం మారితే స్మార్ట్‌కార్డులు నిరుపయోగమవుతాయన్నారు. కర్ణాటకలో సిద్దరామయ్య హయాంలో ఇలాగే చేశారన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ వందల కోట్లతో చేసిన స్మార్ట్ కార్డులన్నీ వృథా అయ్యాయని తెలిపారు. ఇక్కడ కూడా ముఖ్యమంత్రి మారితే ఆ ఫొటోలతో ముద్రించిన కార్డులు వృథాగా మారతాయని చెప్పారు. సంక్షేమ పథకాలను రాజకీయ వివాదాలు చేయవద్దని ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు.

# అది మా గొంతును అణచివేసే ప్రయత్నమే

- మొదటి పేజి తరువాయి

6.45 గంటలకు ఖాతాను పునరుద్ధరించినట్లు మరో పోస్టులో తెలిపారు. ఇలాంటి చర్యలకు తాము భయపడమని దీప్కే పేర్కొన్నారు. తమను అడ్డుకోవాలనుకునేవారు స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఎంచుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రధాని మోదీ ఎర్రకోట నుంచి జాతినుద్దేశించి ప్రసంగించడానికి ముందు ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. "స్కూల్ ఠీక్ కరో" ప్రారంభం దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఏ పార్టీ అధికారంలో ఉన్నా మారడం లేదని దీప్కే అన్నారు. మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలోని తన సొంత గ్రామమైన సంతుక్ పింప్రీ నుంచి "స్కూల్ ఠీక్ కరో" (ాఎష్ట్రశీశ్రీ ంష్ట్రఱఎ ఖుతీశీ) ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై తల్లిదండ్రులు, గ్రామస్థులు, సర్పంచ్‌లు సామాజిక తనిఖీలు చేసి నిలదీయాల్సిన సమయం వచ్చిందని పిలుపునిచ్చారు. భారీ ప్రచారాలకు ఖర్చు చేసే డబ్బును గ్రామీణ పాఠశాలలు, విద్యార్థుల కోసం వెచ్చిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమం కోసం తాము బృందాలను ఏర్పాటు చేశామని, వారు గ్రామాలను సందర్శించి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తారని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు అవుతున్నా గ్రామీణ విద్యార్థులు పాఠశాలల్లో కనీస సౌకర్యాల కోసం ఇంకా ఎదురుచూసే పరిస్థితి ఉండకూడని దీప్కే పేర్కొన్నారు.

## ట్వీట్లతోనో, స్పీచ్ లతోనే ఆక్రమించలేరు..

- మొదటి పేజి తరువాయి

ఈ వ్యాఖ్యలపై ఇరాన్ విదేశాంగ శాఖ అత్యంత ఘాటుగా స్పందించింది. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా మండిపడిన ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి కాజెమ్ గరీబాబాడీ, ఒక సోషల్ మీడియా ట్వీట్ ద్వారానో, యుద్ధనౌకలతో బెదిరించడం ద్వారానో లేదా ఎన్నికల ఉపన్యాసాలతోనో హర్మూజ్ జలసంధిని ఎవరూ ఆక్రమించలేరని స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధి ఇరాన్‌దేనని ఆయన తేల్చి చెప్పారు. ఇరాన్ విధించిన షరతులను అంగీకరించే వరకు జలసంధిని మూసివేయడం లేదా తెరవడం పూర్తిగా ఇరాన్ కమాండ్ నియంత్రణలోనే ఉంటుందని స్పష్టం చేశారు. ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 20 శాతానికి పైగా జరిగే ఈ వ్యూహాత్మక మార్గంలో అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు పెరుగుతుండటంతో గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరలపై తీవ్ర ప్రభావం పడుతోంది.

## 22ఏ పేరుతో భారీ దోపిడీ జరుగుతోంది

తెలంగాణలో నిషేధిత భూముల జాబితా (22ఏ) ముసుగులో భారీ దోపిడీ సాగుతోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనల మధ్య ఎలాంటి తేడా లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న 2.77 కోట్ల ఎకరాల్లో ఏకంగా 95 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారని బండి సంజయ్ నిలదీశారు. ప్రజలు కష్టపడి కొనుక్కున్న స్థలాలు, పరిశ్రమలకు కేటాయించిన భూములు, ప్రభుత్వమే వేలం వేసిన భూములను కూడా ఈ జాబితాలో చేర్చి వేధిస్తున్నారని విమర్శించారు. విద్యాసంస్థల ఫీజు రీయింబర్స్ మెంట్ పాత బకాయిలను ఇంకా చెల్లించకుండా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్వాన్స్ ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. జెన్-జీ యువతకు స్థానం కల్పిస్తామనే కాంగ్రెస్ మాటలు నిజమైతే... వెంటనే యువకులకు మంత్రి పదవులు, ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలని సవాల్ విసిరారు.

# చిన్న తప్పు కూడా పెద్ద నష్టం కలిగిస్తుంది

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ (పీఎంఐఎస్) కింద పనిచేస్తున్న ఇంటర్న్‌లతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె యువతకు ముఖ్యమైన సందేశం ఇచ్చారు. "మీరు ఏ పని చేసినా జాగ్రత్తగా, పరిపూర్ణంగా చేయాలి. ఎందుకంటే చిన్న తప్పు కూడా వేరొకరికి తీవ్ర పరిణామాలు కలిగించవచ్చు" అని ఆమె చెప్పారు. మోటార్‌సైకిల్ తయారీలో ఒక చిన్న భాగంలో తప్పు జరిగితే, కొనుగోలు చేసిన వ్యక్తికి ప్రమాదం, నష్టం కలగవచ్చని ఉదాహరణగా చెప్పారు. బ్యాంకింగ్ రంగంలో కూడా ఒక వెయ్యి రూపాయల బదులు లక్ష రూపాయలు పంపితే నష్టం ఎవరికి వస్తుందని ప్రశ్నించారు. డిజిటల్ సమాచారం నిర్వహణలో తప్పు జరిగితే కస్టమర్‌కు కొత్త సమస్యలు వస్తాయని హెచ్చరించారు. "మీరు నష్టపోరు, వేరొకరు భరించాల్సి వస్తుంది. కాబట్టి ప్రతి క్షణం పరిపూర్ణంగా పని చేయండి" అని ఆమె సూచించారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల నుంచి వచ్చిన ఇంటర్న్‌లు పరిశ్రమ అనుభవం, నైపుణ్యాలు సంపాదిస్తున్నారని నిర్మలా సీతారామన్ అభినందించారు. పీఎంఐఎస్ పథకం ద్వారా యువతకు భారత్‌లోని టాప్ 500 కంపెనీల్లో 12 నెలల హ్యాండ్స్-ఆన్ అనుభవం లభిస్తోందని, విద్యా-పరిశ్రమ మధ్య గ్యాప్‌ను తగ్గించడమే దీని లక్ష్యమని తెలిపారు.

## అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రకృతి బీభత్సం..

# ఐదుగురు సైనికులు గల్లంతు

అరుణాచల్ ప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. శుక్రవారం సాయంత్రం వేర్వేరు జిల్లాల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో ఐదుగురు ఆర్మీ సిబ్బంది గల్లంతవగా, నలుగురు కూలీలు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు సంభవించడమే ఈ దుర్ఘటనలకు ప్రధాన కారణం.

దిబాంగ్ వ్యాలీ జిల్లాలోని పసు పానీ ఆర్మీ క్యాంపులో ఈ ఘటన చోటుచేసుకుంది. భారీ వర్షం కారణంగా వచ్చిన ఆకస్మిక వరద, 5వ గ్రెనేడియర్‌కు చెందిన రెండు షెల్టర్లను ముంచెత్తింది. ఈ వరద ఉద్ధృతిలో ఏడుగురు సైనికులు కొట్టుకుపోగా, వారిలో ఇద్దరిని సిబ్బంది సురక్షితంగా రక్షించారు. గల్లంతైన మరో ఐదుగురి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరోవైపు, అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో మరో దుర్ఘటన చోటుచేసుకుంది. కియోజరింగ్-బయాచింగ్ రహదారి నిర్మాణ పనుల వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ శిథిలాల కింద పలువురు చిక్కుకోగా, నలుగురు కార్మికులు మరణించి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. ఈ రెండు ఘటనల సమాచారం అందిన వెంటనే, సమీపంలోని పోస్టుల నుంచి సహాయక బృందాలు రంగంలోకి దిగి గాలింపు, సహాయక చర్యలు చేపట్టాయి.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్





జాతీయ జెండా ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు డా.కె.కేశవరావు..



మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి..

# త్యాగాల స్ఫూర్తితో..!
# 80వ స్వాతంత్ర్య వేడుకలు..!

- జాతీయ జెండా ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనం స్వీకరించిన డా.కె.కేశవరావు.
- మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జాతి గర్వించేలా ఘనంగా జెండా పండుగ..

- కలెక్టరేట్‌లో రెపరెపలాడిన త్రివర్ణ పతాకం.. మార్మోగిన దేశభక్తి నినాదాలు..!
- స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ఘన నివాళి, జానాభాయ్, రాజారెడ్డిలకు సత్కారం..
- దేశభక్తిని చాటిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు.. ఆకట్టుకున్న జాతీయ స్ఫూర్తి..
- ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేత..
- ప్రజా సంక్షేమం-రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తెలంగాణ ప్రభుత్వం..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 15:** మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు..జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు డా. కె. కేశవరావు, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పబ్లిక్ అఫైర్స్) డా. కె. కేశవరావు హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, ఉప్పల్ డీసీపీ సురేష్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి పాల్గొన్నారు.. జాతీయ పతాకావిష్కరణ అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని డా.కె. కేశవరావు అందించారు.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ఆయన స్మరించుకున్నారు.. ఈ సందర్భంగా డా. కె. కేశవరావు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు ఎందరో మహనీయులు తమ జీవితాలను పణంగా పెట్టి పోరాడారని గుర్తు చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను, వారి కుటుంబాల సేవలను స్మరించుకుంటూ కృతజ్ఞతలతో జోహార్లు అర్పించారు. వారి త్యాగాల ఫలితంగానే మనం స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆర్థిక, సామాజిక, పరిపాలనా రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు..

-4 లో



జాతీయ పతాకాన్ని ఎగురవేసిన ప్రభుత్వ సలహాదారు డా.కె.కేశవరావు..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి



## త్యాగధనుల స్ఫూర్తితో..
## తిరంగాకు ఘన వందనం..!

**బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ పతాకావిష్కరణ..**

- మల్లంపేట్,గండిమైసమ్మలో రెపరెపలాడిన మువ్వన్నెల జాతీయ జెండా..
- 'హర్ ఘర్' తిరంగా.. 'ఘర్ ఘర్' తిరంగాతో దేశభక్తి చాటిన బీజేపీ..
- స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించిన పీసరి కృష్ణారెడ్డి..
- భారతీయత, జాతీయతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత..
- స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు..

-5 లో

## అర్హులందరికీ రేషన్ కార్డులు..
## నిరంతర ప్రక్రియ

- అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ప్రకటన
- ఇప్పటికే 16 లక్షల కొత్త కార్డులు జారీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్న బియ్యం ఉచితంగా పంపిణీ
- స్మార్ట్ రేషన్ కార్డు కుటుంబానికి గౌరవం, భరోసా అని వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసిందని, ఇది ఒక చారిత్రక ఘట్టమని అభివర్ణించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. గతంలో ప్రజలకు నాణ్యత లేని దొడ్డు బియ్యాన్ని సరఫరా చేసేవారని, అయితే తమ ప్రభుత్వం రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించి సన్న బియ్యాన్ని సేకరిస్తోందని తెలిపారు. దేశంలో మరే ఇతర రాష్ట్రంలో లేని విధంగా ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని

-4 లో



# త్యాగాల స్ఫూర్తితో..! 80వ స్వాతంత్ర్య వేడుకలు..!



స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న ముఖ్య అతిథి డా.కె. కేశవరావు..



భరత నాట్యంతో ప్రతిభను కనబరిచిన చిన్నారికి, కలెక్టర్ మను బహుమతి ప్రధానం..

## సంక్షేమ పథకాలకే ప్రభుత్వం ప్రాధాన్యత..!

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కేశవరావు తెలిపారు. పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని పేర్కొన్నారు.. గృహజ్యోతి, రేషన్ కార్డుల పంపిణీతో పాటు లబ్ధిదారులకు సన్నబియ్యం అందిస్తున్నట్లు వివరించారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. బస్తీ దవాఖానాల ద్వారా ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పుస్తకాలు, యూనిఫామ్‌లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని కూడా ఆయన సందేశంలో వివరించారు..

## స్వాతంత్ర్య సమరయోధులకు ఘన సత్కారం..

వేడుకలకు హాజరైన స్వాతంత్ర్య సమరయోధులు జానాభాయ్, రాజారెడ్డిలను ప్రభుత్వ సలహాదారు డా. కె. కేశవరావు, జిల్లా కలెక్టర్ మను చౌదరి, డీసీపీ సురేష్ కుమార్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. వారికి శాలువాలు కప్పి గౌరవించారు.. అటు విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కీసర ఎంజిపీటిబీసీ, శామీర్‌పేట్ జెడ్పీహెచ్‌ఎస్, ఉప్పల్ టీజీఎంఆర్, మేడిపల్లి జెడ్పీహెచ్‌ఎస్, గిరిజన హాస్టల్, కుత్బుల్లాపూర్ ఎస్సీ వెల్ఫేర్ సంస్థలకు చెందిన విద్యార్థులు దేశభక్తి, సాంస్కృతిక అంశాలతో అద్భుతమైన నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.. విద్యార్థుల ప్రతిభను జిల్లా కలెక్టర్ మను చౌదరి అభినందించారు. ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా మెమెంటోలు అందజేశారు..



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు..

## ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు..

జిల్లాలో తమ విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన జిల్లా అధికారులు, ఉద్యోగులను ఈ సందర్భంగా సత్కరించారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి, డీసీపీ సురేష్ కుమార్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డిలతో కలిసి ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, డీఈఓ రేణుక, కలెక్టరేట్ పరిపాలన అధికారి సీతారాం, ఇన్‌చార్జ్ డీఆర్‌డీఓ పీడీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



జాతీయతా భావాన్ని పెంపొందించే.. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమం..



ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రం



తెలంగాణ ఆచార సాంప్రదాయిక సాంస్కృతిక నృత్య రూపక కార్యక్రమం..

## అర్హులందరికీ రేషన్ కార్డులు.. నిరంతర ప్రక్రియ

-3 పేజి తరువాయి

ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఆహార భద్రతకే కాకుండా, అది ఒక కుటుంబానికి ప్రభుత్వం కల్పించే గౌరవం, గుర్తింపు అని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో లేని ఎన్నో సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని, అందులో భాగంగానే ప్రతి నియోజకవర్గానికి 3,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను పరిశీలించి, త్వరలోనే వారికి కూడా కార్డులు జారీ చేస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.



బౌరంపేట్ బీజేపీ కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ గావించిన పీసరి కృష్ణారెడ్డి..



# త్యాగధనుల స్ఫూర్తితో... తిరంగాకు ఘన వందనం..!

## బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ పతాకావిష్కరణ..



మల్లంపేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు..



- మల్లంపేట్,గండిమైసమ్మలో రెపరెపలాడిన ముద్వన్నెల జాతీయ జెండా..
- 'హర్ ఘర్' తిరంగా.. 'ఘర్ ఘర్' తిరంగాతో దేశభక్తి చాటిన బీజేపీ..
- స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించిన పీసరి కృష్ణారెడ్డి..
- భారతీయత, జాతీయతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత..
- స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు..

**దుండిగల్, పెన్ పవర్, ఆగష్టు 15:** భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధి, బౌరంపేట్ డివిజన్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.. మల్లంపేట్‌లో, గండిమైసమ్మ చౌరస్తాలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు గత వారం రోజులుగా 'హర్ ఘర్' తిరంగా.. 'ఘర్ ఘర్' తిరంగా నినాదంతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసే కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు.. అలాగే వివిధ బస్తీలు, జిల్లాలు, రాష్ట్ర స్థాయిలో తిరంగా ర్యాలీలు నిర్వహించి దేశభక్తి భావనను ప్రజల్లో చాటారని పేర్కొన్నారు.. భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఆయన అన్నారు. మహారాణా ప్రతాప్, ఛత్రపతి శివాజీ మహారాజ్, బాలగంగాధర్ తిలక్, వీర సావర్కర్, భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, ఝాన్సీ లక్ష్మీబాయి, రాణి రుద్రమదేవి, అల్లూరి సీతారామరాజు, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ, ఛత్రపతి శంభాజీ మహారాజ్ తదితర వీరుల దేశభక్తిని, ప్రాణత్యాగాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు..

### జాతీయతా భావాలను పెంపొందించాలి..

దేశ సమగ్రత, జాతీయత, భారతీయ సంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పీసరి కృష్ణారెడ్డి గుర్తు చేశారు.. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, వారిలో దేశభక్తి, భారతీయత, జాతీయత భావాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోనె మల్లారెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఏ. మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ ఎంబరి ఆంజనేయులు, దళిత మోర్చా జిల్లా నాయకులు ఎస్. నర్సింగ్ రావు, సెంట్రింగ్ నర్సింహా, జి. మోహన్ రెడ్డి, గణేష్ ముదిరాజ్, యువమోర్చా జిల్లా నాయకులు మేడ్చల్ అతీష్ బాబు, సార నవీన్, ఎస్. గణేష్, బాలగారి శ్రీకాంత్, పోలింగ్ బూత్ అధ్యక్షులు పి. మాధవరెడ్డి, గొటికె కే. శివకుమార్, నవీన్ కుమార్తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

---





# నిజాంపేట్‌లో ముద్వన్నెల జెండా వేడుకలు..



- బిక్షపతి యాదవ్ ఆధ్వర్యాన 275వ డివిజన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.
- కొల్లి మాధవి చేతుల మీదుగా బండారి లేఔట్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ..
- అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వాడవాడలా మార్మోగిన దేశభక్తి నినాదం..
- జాతీయ జెండా ఆవిష్కరణ,స్వీట్ల పంపిణీ పెద్ద సంఖ్యలో పాల్గొన్న కాలనీ ప్రజలు..

## బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు..

**నిజాంపేట్ సిఎంసి, పెన్ పవర్, ఆగష్టు 15:** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజాంపేట్ సర్కిల్ 275వ డివిజన్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షులు బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించారు.. బండారి లేఔట్‌లోని సూపర్ మార్కెట్, నిజాంపేట్ హనుమాన్ టెంపుల్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ముద్వన్నెల జాతీయ జెండాలను ఆవిష్కరించి, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.. బండారి లేఔట్‌లోని సూపర్ మార్కెట్ వద్ద నిర్వహించిన జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీమతి కొల్లి మాధవి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరంలో ప్రాణత్యాగం చేసిన అమర వీరులను స్మరించుకుంటూ, వారి త్యాగాలు, దేశభక్తి స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.. అనంతరం నిజాంపేట్ హనుమాన్ టెంపుల్ వద్ద బిక్షపతి యాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు..ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు సచిన్, శ్రీనివాస్ గుప్తా, దాసి నాగరాజు, సుమన్ రావు, ఎన్.ఆర్.కే. ముదిరాజ్, సిద్దు, వెంకటేష్, అమరేందర్, మల్లేష్ గౌడ్, రాజశేఖర్, శ్రీకాంత్ గౌడ్, పాండు, నరసింహారెడ్డి,
శిల్పారెడ్డి, పద్మ ప్రసాద్, కౌశిక్, జోసఫ్, అమర్, రాజేష్, ఫణి, రామకృష్ణ, బోస్ తదితరులు పాల్గొన్నారు.. అలాగే ఆర్ఎస్ఎస్‌కు చెందిన సునీల్ మహేశ్వరి, రూపేష్, త్రిలోచన్, వీహెచ్‌పీకి చెందిన వెంకటేష్‌తో పాటు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు. దేశభక్తి నినాదాలతో ప్రాంతమంతా మార్మోగగా, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉత్సాహభరిత

# రేవంత్ మార్క్ సింగిల్ హ్యాండ్ ఫైట్

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య జరుగుతున్న పొలిటికల్ వార్ రోజురోజుకూ ఉద్రిక్తంగా మారుతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , మాజీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలో ప్రతిపక్షం ప్రభుత్వంపై దాడిని పీక్స్‌కు తీసుకెళ్లింది. టెస్సరాక్ట్ భూ కేటాయింపుల వివాదం, మూసీ ప్రక్షాళన వ్యయం, సీఎం రేవంత్ రెడ్డి సోదరుల ప్రమేయం, లగచర్ల ఘటన, హైడ్రా కూల్చివేతలు తదితర అంశాలను ఆసరాగా చేసుకుని ప్రతిపక్షం రోజుకో ప్రెస్‌మీట్, సోషల్ మీడియా క్యాంపెయిన్లతో హోరెత్తిస్తోంది. అయితే, ఈ స్థాయి పొలిటికల్ అటాక్‌ను ఎదుర్కొని, ప్రభుత్వ ఇమేజ్‌ను కాపాడుకోవడంలో కాంగ్రెస్ పార్టీ వైపు స్పష్టమైన కమ్యూనికేషన్ గ్యాప్ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.బీఆర్ఎస్ నేతలు గుప్పించే పొలిటికల్ ఆరోపణలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తరపున ప్రధానంగా పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఒక్కరే మీడియా ముందుకు వస్తున్నారు. అయితే, శ్రీధర్ బాబు శైలి అత్యంత విద్యావంతమైనది, సాంకేతికాంశాల చుట్టూ తిరిగేది. ఆయన పాలసీ రూల్స్, చట్టపరమైన నిబంధనలను కూలంకషంగా వివరించినప్పటికీ.. బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అగ్రెసివ్ , మాస్ పొలిటికల్ అటాక్‌ను కౌంటర్ చేయడానికి ఆ వివరణలు సరిపోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పొలిటికల్ ఆరోపణలకు సమాధానం పొలిటికల్ లాంగ్వేజ్‌లోనే ఉండాలి తప్ప, కేవలం టెక్నికల్ డిఫెన్స్ ఇవ్వడం వల్ల ప్రతిపక్షాలు సృష్టించే నెరేటివ్ జనాల్లోకి బలంగా వెళ్లే ప్రమాదం ఉందనేది క్యాడర్ భావన.రేవంత్ కేబినెట్‌లో బలమైన వాగ్ధాటి, ప్రతిపక్షాలను ఉతికిఆరేయగల సీనియర్ నేతలు, మంత్రులు ఉన్నప్పటికీ.. ప్రతిపక్ష దాడిని ఎదుర్కొనే విషయంలో వారు మౌనం దాల్చడం గమనార్హం. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడిన పలువురు కీలక నేతలు, ప్రస్తుతం తమ తమ శాఖలకే పరిమితమవుతున్నారు తప్ప, ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణలను తిప్పికొట్టే బాధ్యతను తమ భుజాన వేసుకోవడం లేదు. దీని వెనుక పార్టీలోని అంతర్గత విభేదాలు, సమన్వయ లోపం ఉందా? లేక సీఎం



రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగే వరకు వేచి చూసే ధోరణి ఉందా? అనేది కాంగ్రెస్ వర్గాల్లోనే చర్చనీయాంశంగా మారింది.నేటి రాజకీయాల్లో సోషల్ మీడియానే ప్రధాన ఆయుధం. కేటీఆర్, హరీష్ రావు ప్రతి ఆరోపణను ఎక్స్ , యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్‌లలో ప విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. బిఆర్ఎస్ సోషల్ మీడియా వింగ్ అత్యంత సమర్థవంతంగా ప్రతికూల వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తుంటే.. కాంగ్రెస్ సోషల్ మీడియా వింగ్ మాత్రం దానికి తగిన స్థాయిలో, అంతే వేగంగా డిఫెన్స్ లేదా కౌంటర్ అటాక్ చేయలేకపోతోంది. సాంకేతిక ఆధారాలతో కౌంటర్ వీడియోలు వదలడంలో కాంగ్రెస్ తీవ్రంగా వెనుకబడిపోయింది.ప్రభుత్వంపై ఆరోపణలు వచ్చిన ప్రతిసారీ సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా బహిరంగ సభల్లో లేదా ప్రత్యేకంగా నిర్వహించే సమావేశాల్లో తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. అయితే, ఒక ముఖ్యమంత్రి ప్రతి చిన్న ఆరోపణకూ సమాధానం చెప్పుకుంటూపోవడం రాజకీయంగా సరైన వ్యూహం కాదనేది పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ మాట. సీఎంకు మద్దతుగా ద్వితీయామ్నాయ నాయకత్వం , అధికారిక ప్రతినిధులు, మంత్రులు రంగంలోకి దిగి రోజువారీ దాడులను తిప్పికొట్టాలి.
కానీ, కాంగ్రెస్‌లో సీఎం ఒక్కరే మాట్లాడటం, మిగిలిన వారంతా ప్రేక్షక పాత్ర పోషించడం వల్ల కేటీఆర్, హరీష్ రావుల దాడి మరింత పదునెక్కుతోంది. ప్రతిపక్షం చేసే దాడిని తక్కువగా అంచనా వేయడం అధికార పార్టీకి ఎప్పుడూ ప్రమాదకరమే. కేవలం దుద్దిళ్ల శ్రీధర్ బాబు సాంకేతిక వివరణలతో సరిపెట్టకుండా.. అగ్రెసివ్ పొలిటికల్ వాయిస్ ఉన్న నేతలతో ఒక 'కమ్యూనికేషన్ వార్ రూమ్'ను కాంగ్రెస్ వెంటనే ఏర్పాటు చేయాల్సి ఉంది. కేటీఆర్, హరీష్ రావుల మైండ్ గేమ్‌కు చెక్ పెట్టాలంటే.. కాంగ్రెస్ తన కమ్యూనికేషన్ గ్యాప్‌ను భర్తీ చేసుకుని, కలెక్టివ్ అటాక్ మోడ్‌లోకి రావడం తక్షణ అవసరమని ఎక్కువ మంది భావిస్తున్నారు.

# రేవంత్ ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యే

**హైదరాబాద్, ఆగస్టు 15, పెన్ పవర్:**
రాజకీయాలలో గతంలో ఈ స్థాయిలో సంచలన పరిణామాలు జరిగేవి కావు. కానీ ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని లక్ష్యంగా చేసుకొని గులాబీ పార్టీ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. చివరికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడా రేవంత్ నాయకత్వాన్ని తప్పుపడుతున్నారు. ఇక ఒక ఎమ్మెల్యే అయితే మరింత ముందడుగు వేసి రేవంత్ ముందే.. అనకూడని మాట అనేశాడు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందా.. తొందరపాటు వల్ల జరిగిందా అనే విషయాన్ని పక్కన పెడితే.. జరగాల్సిన నష్టం జరిగిపోయింది. సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బీసీ సంఘాల ప్రతినిధులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి మాట్లాడుతూ.. ఒకసారిగా సీఎం కేసీఆర్ అని సంబోధించారు. దీంతో అక్కడ వాతావరణం మారిపోయింది. ఆ తర్వాత తన తప్పు తెలుసుకుని దానం నాగేందర్ సీఎం రేవంత్ రెడ్డి అని పేర్కొన్నారు.దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను గులాబీ పార్టీ నేతలు విస్తృతంగా సర్కులేట్ చేస్తున్నారు. గతంలో కూడా రేవంత్ రెడ్డిని ఓ కార్యక్రమానికి నిర్వాహకులు ఆహ్వానించారు. ఆ సమయంలో వేదిక ముందు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అనబోయి సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. ఆ తర్వాత అల్లు అర్జున్ కూడా ఓ కార్యక్రమంలో సీఎం పేరును తప్పుగా పలికారు. ఇలా అనేక సందర్భాలలో రేవంత్ రెడ్డి పేరును నిర్వాహకులు మర్చిపోయారు. చివరికి కాంగ్రెస్ నాయకులు కూడా రేవంత్ రెడ్డి పేరుకు బదులుగా కేసీఆర్ పేరు పలికారు. దీంతో ఇది గులాబీ పార్టీ నేతలకు ఆయుధంగా మారింది. రేవంత్ రెడ్డి పేరు సీఎంగా ఎవరూ గుర్తుంచుకోవడంలేదని.. కెసిఆర్ తెలంగాణ ప్రజల్లో.. తెలంగాణ నాయకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని గులాబీ పార్టీ నేతలు కవరింగ్ ఇచ్చుకోవడం మొదలుపెట్టారు.ఏదైనా సభ జరిగినప్పుడు.. సమావేశం నిర్వహిస్తున్నప్పుడు నిర్వాహకుల్లో ఒక రకమైన ఒత్తిడి ఉంటుంది. వారిలో తెలియని ఉద్వేగం ఉంటుంది. అప్పుడు వారు మాట్లాడుతున్నప్పుడు తప్పులు దొర్లుతుంటాయి. కాకపోతే నేటి సోషల్ మీడియా కాలంలో ఇటువంటి వాటికే ఆదరణ ఉంటుంది కాబట్టి.. పైగా ప్రత్యర్థి పార్టీలు ఎప్పుడు తప్పు జరుగుతుందా అని ఎదురుచూస్తాయి కాబట్టి.. ఇటువంటి వ్యవహారాలు మీడియాలో విస్తృతంగా సర్కులేట్ అవుతుంటాయి. ఇటువంటి వీడియోలను సోషల్ మీడియాలో ప్రచారం చేయడానికి ప్రత్యేకంగా ఒక బ్యాచ్ ఉంటుందని విషయాన్ని ప్రముఖంగా చెప్పాల్సిన అవసరం లేదు.. అయితే ఇక్కడ దాన నాగేందర్ రేవంత్ పేరు మర్చిపోయినంత మాత్రాన.. కెసిఆర్ పేరు ప్రస్తావించినతమాత్రాన. రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కాలేరు.. కెసిఆర్ ముఖ్యమంత్రి అవ్వలేరు. ఈ విషయం తెలిసినప్పటికీ.. కొంతమందికి ప్రచార పిచ్చి ఉంటుంది.. వ్యక్తి పూజ ఉంటుంది కాబట్టి.. హడావిడి చేస్తుంటారు. అంతే అంతకుమించి ఏమీ లేదు.

# క్యాష్ కంట్రావర్సీలో మంత్రిగారు...

**హైదరాబాద్ పెన్ పవర్:**
విదేశాలలో ఉన్న మనవాళ్లు ఇండియాకు డబ్బులు పంపిస్తుంటారు. ఇది ఎప్పటినుంచో జరుగుతున్నది. కానీ ఆ మంత్రి గారు దీనిని మార్చేశారు. ఏకంగా తెలంగాణ నుంచి విదేశాలకు డబ్బులు తీసుకెళ్లారు. అదికూడా కట్టల కొద్దీ నోట్లతో వెళ్లారు. చివరికి అడ్డంగా దొరికిపోయారుఆ మంత్రి మీద అనేక రకాలుగా అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆయన భార్య ఏకంగా రంగంలోకి దిగి కమిషన్ ఇస్తేనే బిల్లులు మంజూరు చేస్తారని అభియోగాలు ఉన్నాయి. పైగా ఆయన నీతి వాక్యాలు చెప్పడంలో దిట్ట. తనకు తాను సంఘసంస్కర్తను అని చెప్పుకుంటారు. కానీ లోపల మాత్రం కమిషన్లు లాగుతూ ఉంటారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మంత్రి పర్సంటేజ్ మినిస్టర్ అవతారం ఎత్తారు. కీలకమైన శాఖలను ఆయన తన వద్ద పెట్టుకున్నారు. అందులో భారీగా కాంట్రాక్టులు.. బిల్లులను మంజూరు చేయడానికి కమిషన్లు వసూలు చేయడం ప్రారంభించారు. ఈయనకు 30% కమిషన్ మినిస్టర్ గా పేరుంది. దీన్నిబట్టి సదరు మంత్రివర్యుల వసూళ్ల స్థాయి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.మంత్రిగారి భార్య వసూళ్ల వ్యవహారాన్ని చక్కబెడతారని సమాచారం. మీడియం, బిలో మీడియం అమౌంట్లు మొత్తం సదరు మంత్రిగారి భార్యనే సెటిల్ చేస్తారు. హై రేంజ్ అమౌంట్ ను మాత్రమే మంత్రిగారు చూసుకుంటారు. ఇక ఇటీవల ఆ మంత్రి గారు విదేశాలకు వెళ్లారు. అక్కడికి వెళుతూ భారీగా డబ్బులను తీసుకెళ్లారు. అయితే ఇమ్మిగ్రేషన్ అధికారులు విమానాశ్రయంలో అడ్డుకోవడంతో మంత్రిగారికి ఒక్కసారిగా షాక్ తగిలింది. సుమారు గంటన్నర పాటు ఆయన విమానాశ్రయంలోనే కూర్చోవలసి వచ్చింది.."ఇంత భారీ స్థాయిలో డబ్బు ఎక్కడికి తీసుకెళ్తున్నారు.. ఎందుకు తీసుకెళ్తున్నారు.. ఎక్కడి నుంచి సమకూర్చుకున్నారు వంటి ప్రశ్నలు అక్కడి విమానాశ్రయ అధికారులు వేసినట్టు సమాచారం..అంత భారీ స్థాయిలో డబ్బు తీసుకెళ్లడం పట్ల విమానాశ్రయ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. సదరు మంత్రిని విమానాశ్రయంలోనే నిలిపివేశారు. మంత్రికి ఆహ్వానం పలకడానికి వచ్చిన వారంతా ఈ ఘటన గురించి తెలుసుకొని షాక్ కు గురయ్యారు. ఆ తర్వాత అక్కడివారు విమానాశ్రయ అధికారులను ఒప్పించడంతో.. ఆ డబ్బు తీసుకెళ్లడానికి లైన్ క్లియర్ అయింది. అయితే ఆ డబ్బును సదరు మంత్రి అక్కడికి ఎందుకు తీసుకెళ్లారు.. దాంతో ఏం చేయబోతున్నారనేది.. ఇప్పుడు రాజకీయ వర్గాలలో తీవ్రమైన చర్చకు దారితీస్తోంది. ఓ వర్గం మీడియా దీనిని దాచే ప్రయత్నం చేసినప్పటికీ సోషల్ మీడియా స్ట్రాంగ్ కదా..ఎలా దాగుతుంది..మొత్తానికి అంతా తెలిసిపోయింది.

# రేవంతక్ కు బ్రదర్స్ సెగ...
# సైలెంట్ మోడ్ లో పార్టీ లీడర్స్


**హైదరాబాద్, ఆగస్టు 15, పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నియమితులైన నాటి నుంచి భారత రాష్ట్రపతి ఎదురు దాడి చేస్తూనే ఉంది. రేవంత్ రెడ్డి లక్ష్యంగా చేసుకొని విమర్శలు.. ఆరోపణలు.. సొంత మీడియాలో కథనాలు.. ఇవన్నీ గులాబీ పార్టీకి పరిపాటిగా మారిపోయాయి. చివరికి రేవంత్ సోదరుల విషయంలో కూడా గులాబీ పార్టీ ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. రేవంత్ సోదరులను లక్ష్యంగా చేసుకొని గులాబీ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. తద్వారా ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.రేవంత్ సోదరుల మీద గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఆ పార్టీ సీనియర్ నాయకుడు హరీష్ రావు పక్క వ్యూహాలతో ముందుకు వెళ్తున్నారు. రేవంత్ సోదరులు తిరుపతిరెడ్డి.. కొండల్ రెడ్డి భూ దందాలకు పాల్పడుతున్నారని.. ప్రభుత్వం వారికి ఆయాచితంగా భూములు కేటాయిస్తోందని.. వందల కోట్ల విలువైన భూములు అతి తక్కువ ధరకే వారిద్దరికీ లభిస్తున్నాయని కేటీఆర్.. హరీష్ రావు ఆరోపిస్తున్నారు.కొండల్ రెడ్డి వ్యాపారం చేస్తుంటారు. తిరుపతి రెడ్డి కొడంగల్ నియోజకవర్గం సంబంధించిన వ్యవహారాలు చూస్తూ ఉంటారు.. తాజాగా తెలంగాణ ప్రభుత్వం టెస్స రాక్ట్ అనే కంపెనీకి భూములు కేటాయించింది. అత్యంత విలువైన భూములను ఏ కంపెనీకి ప్రభుత్వం అప్పనంగా కట్టబెట్టిందని.. ఈ కంపెనీ కొండల్ రెడ్డికి జేబు సంస్థ అని గులాబీ పార్టీ ఆరోపణలు చేస్తుంది. రేవంత్ రెడ్డి తన ముఖ్యమంత్రి అధికారాన్ని ఉపయోగించి.. తన సోదరుడికి భారీగా భూములు కేటాయించారని గులాబీ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఇలాంటి కుంభకోణాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని గులాబీ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.వాస్తవానికి ఇటువంటి ఆరోపణలను తిట్టుకోవాల్సిన కాంగ్రెస్ పార్టీ నిశ్శబ్దంగా ఉంటుంది. ఈ వివాదం మీద కాంగ్రెస్ పార్టీ లో ఉన్న సీనియర్ నాయకులు.. మంత్రులు పెద్దగా స్పందించడం లేదు.. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాత్రమే ఈ వ్యవహారం మీద మాట్లాడుతున్నారు. ప్రభుత్వాన్ని కాస్తలో కాస్త రక్షించే పని చేస్తున్నారు.. భూముల కేటాయింపు.. పారిశ్రామిక విధానం.. చట్టబద్ధమైన నిబంధనలు.. ఇలా అన్ని పాటించి కేటాయింపులు జరిపినట్టు ఆయన వివరిస్తున్నారు. గతంలో గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎటువంటి నిబంధనలు అయితే పాటించారో.. వాటి ఆధారంగానే భూములు కేటాయించామని.. ఇందులో ఎటువంటి మోసం లేదని ఆయన క్లారిటీ ఇస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వం భూములు ఇచ్చినప్పుడు వాటిని పారిశ్రామిక అవసరాల కోసం మాత్రమే ఉపయోగించాలి. కర్మా గారాల నిర్మాణం మాత్రమే అందులో చేపట్టాలి. అలా కాకుండా అందులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే ఊరుకోకూడదు. కానీ ఈ విషయాన్ని బలంగా తీసుకెళ్లడంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విఫలమవుతున్నారు.. ఆ భూముల్లో కుంభకోణానికి పాల్పడే ఆస్కారం లేదనే విషయాన్ని బయటకు చెప్పడంలో అధికార పార్టీ నేతలు విఫలమవుతున్నారు.గులాబీ పార్టీ నేతలు ఆరోపిస్తున్నట్టుగా ఆ కంపెనీకి.. కొండల్ రెడ్డికి ఎటువంటి సంబంధం లేదని చెప్పడంలో కాంగ్రెస్ నాయకులు విఫలమవుతున్నారు. ఇదే నేపథ్యంలో గులాబీ పార్టీ తీవ్రస్థాయిలో రెచ్చిపోతుంది. కొండ రెడ్డి పేరును పదేపదే ప్రస్తావిస్తూ రేవంత్ రెడ్డి ఇమేజ్ ను డ్యామేజ్ చేస్తోంది. అయితే ఇక్కడ కాంగ్రెస్ పార్టీ కేవలం కొన్ని విషయాల గురించి మాత్రమే మాట్లాడుతోంది. అసలు ఈ కంపెనీ వెనుక కొండల్ రెడ్డి లేడు అనే విషయం మీద క్లారిటీ ఇవ్వలేకపోతోంది. మొత్తంగా ఈ వ్యవహారం ద్వారా గులాబీ పార్టీ గట్టిగానే పొలిటికల్ మైలేజ్ సాధించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యమంత్రి మీద నెగిటివిటీని స్ప్రెడ్ చేయడం.. రేవంత్ రెడ్డి కుటుంబం అవినీతిమయమైన కుటుంబం అని ప్రజల్లోకి తీసుకెళ్లడం.. రకరకాల డాక్యుమెంట్లను ప్రజల ముందు పెట్టడం వంటి వాటి ద్వారా గులాబీ పార్టీ లబ్ధి పొందుతోంది. అయితే ఇటువంటి వాటికి కాంగ్రెస్ పార్టీ గట్టిగా కౌంటర్ ఇవ్వకపోవడంతో గులాబీ పార్టీ చేస్తున్న ఆరోపణలు నిజమని చాలామంది నమ్ముతున్నారు. దీర్ఘకాలంలో ఇటువంటి సంఘటనలు ప్రభుత్వానికి చెడ్డ పేరు మాత్రమే కాదు.. అవసరమైతే అధికారానికి దూరంగా కూడా ఉంచుతాయి. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా మేలుకోకపోతే ఇక అంతే సంగతులు.

# వెయ్యి కోట్లు ఇచ్చినా జగ్గారెడ్డి వంటి వారు దొరకరు: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంస



**హైదరాబాద్ పెన్ పవర్:** సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. వెయ్యి కోట్ల రూపాయలు వెచ్చించినా జగ్గారెడ్డి వంటి నాయకుడు దొరకరని ఆయన వ్యాఖ్యానించారు. ఇవాళ సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ముఖ్యమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని శ్రీరాముడు అనుకుంటే, జగ్గారెడ్డి ఆయనకు హనుమంతుడి వంటి వారని అభివర్ణించారు. "నాయకులకు మార్కులు వేస్తే నాకంటే జగ్గారెడ్డికే ఎక్కువ వస్తాయి. అలాంటి నాయకుడిని ఓడించడం ఈ ప్రాంత ప్రజల దురదృష్టం" అని సంగారెడ్డి ప్రజలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ జగ్గారెడ్డి నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ పనిచేస్తున్నారని రేవంత్ రెడ్డి కొనియాడారు. "కుటుంబాన్ని సైతం పక్కనపెట్టి ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకుడు ఆయన. ఇక్కడ పరిస్థితులు ఎలా ఉన్న, జగ్గారెడ్డి కచ్చితంగా ప్రజా జీవితంలోనే ఉండాలి" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# సీఎం వ్యాఖ్యలు సిగ్గుచేటు...అఘోర పూజల ఆరోపణలను ఖండించిన హరీష్ రావు



**హైదరాబాద్ పెన్ పవర్:** సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సంగారెడ్డిలో జరిగిన సభలో రేవంత్ రెడ్డి తనపై, బీఆర్ఎస్ పార్టీపై చేసిన అఘోర పూజల ఆరోపణలను ఆయన పూర్తిగా ఖండించారు.
స్వాతంత్ర్య దినోత్సవం రోజు దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా మాట్లాడని విధంగా రేవంత్ రోత మాటలు, చిల్లర మాటలు మాట్లాడారని హరీష్ రావు దుయ్యబట్టారు. సింగూర్ ప్రాజెక్టు గురించి మాట్లాడుతారని ఆశించి వస్తే, సీఎం కేవలం సొల్లు మాటలు మాట్లాడారని ఎద్దేవా చేశారు. సింగూర్‌ను ఖాళీ చేయించి సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో తాగునీటి కష్టాలు తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆరోపించారు.
దమ్ముంటే రేవంత్ రెడ్డి సెక్యూరిటీ లేకుండా అశోక్ నగర్‌కు వచ్చి నిరుద్యోగులతో మాట్లాడాలని సవాల్ విసిరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిందని, కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, కేసీఆర్ రూ. 45 వేల కోట్ల రుణమాఫీ చేస్తే.. రూ. 16 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి రేవంత్ గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. దమ్ముంటే ఏ గ్రామానికైనా వద్దామని, అక్కడ రుణమాఫీ కాకపోతే తాను ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు.మహిళలకు ఇస్తామన్న మహాలక్ష్మి రూ. 2500 ఏమయ్యాయని ప్రశ్నించిన హరీష్ రావు.. రేవంత్ ఒక ఘరానా దొంగ అని అభివర్ణించారు. అవినీతి గురించి ప్రశ్నిస్తే పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నారని, దమ్ముంటే అసెంబ్లీ పెట్టి ప్రజా సమస్యలపై చర్చిద్దామని డిమాండ్ చేశారు. సమయం వచ్చినప్పుడు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



జాతీయ పతకానికి గౌరవ వందనం చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**ఎల్బీనగర్, పెన్ పవర్, ఆగష్టు 15:** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, మహిళలు, విద్యార్థులు, కాలనీవాసులతో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేసి, నియోజకవర్గ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా కోర్టులో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



జాతీయ పతకానికి గౌరవ వందనం చేస్తున్న జిల్లా న్యాయమూర్తి కర్ణకుమార్

**ఎల్బీనగర్ పెన్ పవర్ ఆగష్టు 15:** రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన జిల్లా న్యాయమూర్తి కర్ణకుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వినోద్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోలి విప్లవ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవికుమార్ వొద్యారపు, డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీమతి అనూషతో పాటు పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ దేశ అభివృద్ధి, న్యాయ వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండా వందనం

**మహబూబాబాద్: పెన్ పవర్:** మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 80 వ భారత స్వతంత్ర దినోత్సవ వేడుకలో డిసిసి అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాద్ ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్, మున్సిపల్ చైర్మన్ జ్యోతి రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సురేష్ నాయక్, ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ సెల్ అధ్యక్షులు,డిసిసి కమిటీ సభ్యులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు...

# తెలంగాణలో 'ఫోటో వార్'.. 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్, బీఆర్ఎస్ ఫైట్!

**హైదరాబాద్, ఆగస్టు 15 పెన్ పవర్:**
తెలంగాణలో రాజకీయాలు మరింత వేడెక్కాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య విమర్శల పర్వం ఇప్పుడు సోషల్ మీడియాలో "ఫోటో వార్" రూపం తీసుకుంది. 'ఎక్స్' వేదికగా ఇరు పార్టీల అధికారిక ఖాతాల నుంచే ఎడిట్ చేసిన ఫొటోలతో ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో దాడి చేసుకుంటుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ఫోటోల యుద్ధానికి తెలంగాణ బీజేపీ పెట్టిన ఓ సోషల్ మీడియా పోస్ట్ కారణమైంది. "వన్ టీమ్, వన్ మిషన్ – వికసిత్ తెలంగాణ" అనే క్యాప్షన్‌తో బండి సంజయ్, కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్ వంటి నేతల గ్రూప్ ఫోటోను బీజేపీ పోస్ట్ చేసింది. దీనిపై వెంటనే స్పందించిన బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం.. ఆ ఫోటోలో సీఎం రేవంత్ రెడ్డిని చేర్చి "అసలు వ్యక్తిని మర్చిపోయారేంటి?" అంటూ వ్యంగ్యంగా పోస్ట్ చేసింది. రేవంత్ రెడ్డి, బీజేపీ ఒక్కటేనని చెప్పే ప్రయత్నం చేసింది. బీఆర్ఎస్ పోస్ట్‌పై తీవ్రంగా స్పందించిన కాంగ్రెస్ పార్టీ, అంతకుమించిన దూకుడుతో బదులిచ్చింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీజేపీ నేత బండి సంజయ్ కాళ్లపై పడినట్లుగా మార్ఫింగ్ చేసిన ఫోటోను తమ అధికారిక ఖాతాలలో పోస్ట్ చేసి ఎదురుదాడికి దిగింది. ఈ మార్ఫింగ్ ఫొటోల వివాదం ఇక్కడితో ఆగలేదు. మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు వంటి అంశాలపై కేటీఆర్, హరీశ్‌రావు వ్యంగ్య పోస్టులు పెడుతుండగా, కాంగ్రెస్ పార్టీ కేసీఆర్ ఫామ్‌హౌస్ పాలన, కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలను ఎత్తిచూపుతూ కౌంటర్లు ఇస్తోంది. గతంలో కాంగ్రెస్ నిర్వహించిన ఆన్‌లైన్ పోల్‌ను బీఆర్ఎస్ నకిలీ ఖాతాలతో హైజాక్ చేసిందని కాంగ్రెస్ ఆరోపిస్తుండగా, ఆ పోల్ ఫలితాలే ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని బీఆర్ఎస్ ట్రోల్ చేస్తోంది. ప్రభుత్వ హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికే డిజిటల్ మాధ్యమాలను వాడుకుంటున్నామని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు, బీఆర్ఎస్ మైండ్‌గేమ్‌ను తిప్పికొట్టడానికే తాము కూడా గట్టిగా బదులివ్వాల్సి వస్తోందని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. ప్రధాన పార్టీల అధికారిక సోషల్ మీడియా ఖాతాల నుంచే ఈ స్థాయిలో మార్ఫింగ్ దాడులు జరగడం చూసి నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ సోషల్ మీడియా వార్ మరింత ముదిరే సూచనలు

# ములుగు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఇసుక లారీ ఢీకొట్టడంతో ఇద్దరు స్పాట్ డెడ్

**హైదరాబాద్ పెన్ పవర్:** ములుగు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పస్రా–తాడ్వాయి జాతీయ రహదారిపై ఇసుక లారీ ఓ కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.






మృతులను వరంగల్ జిల్లా కరీమాబాద్ చెందినవారిగా గుర్తించారు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ ప్రమాదంతో పస్రా–తాడ్వాయి జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు వాహనాల రద్దీని క్లియర్ చేశారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




విద్యార్థులకు ప్రైజులు అందజేస్తున్న ప్రిన్సిపల్ రమేష్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 15:** గార్ల స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యాలయ కరస్పాండెంట్, సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, బీరవెల్లి సంజీవరెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని స్వాతంత్ర్య వేడుకలను ప్రారంభించారు. ప్రిన్సిపల్ పసుపులేటి రమేష్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యాలయంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి, ఉన్నత వైద్య చదువులను పూర్తి చేసుకొని ఖమ్మం పట్టణంలోని ఇండస్ ఆసుపత్రిలో ఎమ్మెస్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, రోబోటిక్ సర్జన్ వైద్య వృత్తిని చేపట్టి నిర్వహిస్తున్న డాక్టర్ చాగంటి రాకేష్ విద్యార్థులు చదువులను గొప్పగా రాణించుటకు ప్రత్యేక ప్రోత్సాహకంగా నగదు, మెమొంట్లను ప్రతి సంవత్సరం అందజేస్తున్నారు. అందులో భాగంగా గత సంవత్సరం 10వ తరగతి లో మండల ప్రథమం జిల్లా మేఘన, ద్వితీయం తోకల ప్రీతిక, తృతీయంగా ఇస్లావత్ శ్రీ చరిత్, లకు పాఠశాల కరస్పాండెంట్ లు ప్రిన్సిపాల్ తో కలిసి అందజేశారు. వారు మాట్లాడుతూ భవిష్యత్తులో క్రమశిక్షణతో చదివి అత్యుత్తమ మార్కులు సాధించి విద్యాలయం కు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు సూచించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ స్వాతంత్ర్య కోసం పోరాడిన జాతీయ నాయకుల వేషధారణలతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గార్లలో మిన్నంటిన స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు



గౌరవ వందనం చేస్తున్న పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్



జెండా ఎగరవేస్తున్న సర్పంచ్ పార్వతి

## రెపరెపలాడిన తివర్ణ పతాకం

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 15:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మహబూబాబాద్ జిల్లా గార్ల మండల వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. పలు కార్యాలయాలను విద్యుత్ దీపాలు, రంగురంగుల అలంకరణలతో సుందరంగా ముస్తాబు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు జాతీయ జెండాలను ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. గార్ల మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ బానోత్ పార్వతి నాయక్ రక్షక భట నిలయంలో ఎస్సై సాయి కుమార్, తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యలమరెడ్డి కృష్ణారెడ్డి, జయశంకర్ విగ్రహం వద్ద లక్ష్మణ్ నాయక్, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం ఆవరణలో సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ దుర్గాప్రసాద్, మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ దేశీ రామ్ నాయక్, తహసీల్దార్
కార్యాలయంలో తహసీల్దార్ శారద, పశువైద్యశాలలో డాక్టర్ సురేష్ కుమార్, విద్యుత్ వినియోగదారుల కార్యాలయంలో మధు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తాళ్లపల్లి కృష్ణగౌడ్ సిపిఎం పార్టీ ఆఫీసులో మండల కార్యదర్శి అలవాల సత్యవతి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన పోరాటాలు, త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమాల్లో ఉపసర్పంచ్ జరీనా బేగం, పంచాయతీ మధు నాయుడు, కార్యదర్శి, వార్డు సభ్యులు తోడేటి శ్రీనివాస్, పూర్ణచందర్, సారయ్య, సాయి, ఇమ్రాన్, రావుజీ, భారతి, గ్రామపంచాయతీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. సీపీఎం నాయకులు
కందునూరి శ్రీనివాస్, అలవాల సత్యవతి, టీజీఎస్ నాయకులు గిన్నారపు మురళి, తారక రామారావు, సీపీఐ నాయకులు కట్టెబోయిన శ్రీనివాస్, జంపాల వెంకన్న, కాంగ్రెస్ నాయకులు భూక్య నాగేశ్వరరావు, కోల కుమార్ గౌడ్, శంషాద్ బేగం, రాజశేఖర్, బీఆర్ఎస్ నాయకులు రాధా, ఖదీర్ పాషా గట్టు అనంత రాములు, తెలుగుదేశం నాయకులు కత్తి సత్యం తదితరులు పాల్గొన్నారు.



గౌరవ వందనం చేస్తున్న ఎస్ఐ సాయికుమార్



జెండా ఎగరవేస్తున్న స్పెషల్ ఆఫీసర్ దేశి రామ్

# బాలికల రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో మహిళా ఫ్యాకల్టీనే నియమించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ బాలికల రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో మహిళా ఫ్యాకల్టీనే నియమించాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జనగామ జిల్లా కొడకండ్ల మండలంలో బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో యుక్త వయసులో ఉన్న విద్యార్థినులను పురుష ఫ్యాకల్టీ మానసికంగా , శారీరకంగా వేధిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే వారిని తొలగించి వారి స్థానంలో మహిళా ఫ్యాకల్టీని నియమించాలని నాంపల్లి లోని తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఉషా రాణిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. 2016లో జారీ చేసిన జీవో నెం. 1274 ప్రకారం బాలికల విద్యాసంస్థల్లో మహిళా సిబ్బంది ఉండాల్సి ఉన్నప్పటికీ, కొడకండ్ల బాలికల రెసిడెన్షియల్ విద్యాసంస్థలో 2022 నుంచి పురుష ఫ్యాకల్టీలను నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ అంశంపై విద్యాశాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని బాలికల కళాశాలలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై విచారణ జరిపి భాద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిలుకర రవికుమార్ విజ్ఞప్తి చేశారు.

# మార్షల్ ఆర్ట్స్ నేర్పించిన క్రమశిక్షణ: జనసేనాని గురించి ఎవరికీ తెలియని నిజాలు!

**హైదరాబాద్ పెన్ పవర్:** మార్షల్ ఆర్ట్స్ నుంచి సినిమాలు, రాజకీయ రంగం వరకు పవన్ కళ్యాణ్ ప్రయాణం ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తోంది. ఇటీవల ఆయన మార్షల్ ఆర్ట్స్ ప్రయాణానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో అభిమానుల నుంచి అపారమైన ప్రేమ వెల్లువెత్తింది. కేవలం ఒక నటుడిగానే కాకుండా ఆయనలోని గొప్ప క్రమశిక్షణ– సద్గుణాలు సంఘంలో ప్రత్యేకంగా నిలబెట్టాయి. నేడు ఇండిపెండెన్స్ డే సందర్భంగా పవన్ లోని క్రమశిక్షణ, మంచి లక్షణాల గురించి యువతరం సోషల్ మీడియా వేదికలపై మరోసారి చర్చిస్తోంది.పవన్ కళ్యాణ్ పై అభిమానులు చూపే ఆత్మీయత ఎంతో భావోద్వేగమైనది. దీనికి అభిమానుల కామెంట్లు పెద్ద ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. –పుట్టింది నీ అభిమానిగానే.. శ్వాస విడిచేది నీ అభిమానిగానే! అంటూ సోషల్ మీడియా కామెంట్లలో అభిమానులు తమ నిష్కల్మషమైన ప్రేమను చాటుకుంటున్నారు. పవన్ కళ్యాణ్‌ను కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లో –టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్–.. –ది ఒరిజినల్ హీరో (రా+)– అని అభివర్ణిస్తూనే... ఆయన సమాజానికి దిశానిర్దేశం చేసే ఒక –టార్చ్ బేరర్– లాంటి మనిషి అని కొనియాడారు.



ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ కళ్యాణ్ ఆలోచనలు, నిర్ణయాలు సమాజంలో కొత్త మార్పునకు శ్రీకారం చుట్టాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ ఆయన యువతకు ఇచ్చిన సందేశం సమాజ నిర్మాణంలో వారి బాధ్యతను గుర్తుచేసింది. విధ్వంసక రాజకీయాలకు దూరంగా ఉంటూ.. వ్యవస్థలను సరిచేయడమే అసలైన పురోగతి అని ఆయన స్పష్టం చేశారు.దేశ విభజన గాయాల జ్ఞాపకార్థ దినోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్ షేర్ చేసిన పోస్ట్ అందరినీ ఆలోచింపజేసింది. 1947 నాటి విభజన వల్ల ఇళ్లను, కుటుంబాలను కోల్పోయి లక్షలాది మంది ప్రజలు అనుభవించిన ఆవేదనను ఆయన గుర్తుచేసుకున్నారు. ఆ చీకటి రోజుల్లోనూ మన పూర్వీకులు ప్రదర్శించిన ధైర్యం– ఓర్పు – మానవత్వం నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. గతంలోని కష్టాల నుంచి పాఠాలు నేర్చుకుని ఐక్యత– సామరస్యం– శాంతితో ముందడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. విభజనలను గుర్తుచేసుకోవడం అంటే గతాన్ని తవ్వుకోవడం కాదని.. రేపటి మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవడమేనని స్వాతంత్ర్య దినోత్సవ సామాజిక నోట్ లో జనసేనాని స్పష్టం చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పెంపొందించుకోవాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్న పవన్ కళ్యాణ్ పార్టీలకు అతీతంగా అందరి మన్ననలు పొందుతున్నారు.

# తెరపైకి క్రెడిట్ వార్

**ఏలూరు, ఆగస్టు 15, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు మళ్లీ వార్తలకటటక్కింది. కేంద్ర ప్రభుత్వం పోలవరం ఫేజ్–1 నిర్మాణ సవరించిన అంచనా వ్యయానికి రూ.30,436.95 కోట్లు ఆమోదించడం, దాదాపు రూ.12,157 కోట్లకు పైగా బ్యాలెన్స్ గ్రాంట్‌ను ఖరారు చేయడంతో రాష్ట్రంలో క్రెడిట్ గేమ్ జోరందుకుంది. కేంద్రంలో పట్టుబట్టి, ఎన్డీయే భాగస్వామిగా ఒత్తిడి తెచ్చి పోలవరానికి రూ.12,000 కోట్లకు పైగా ప్రత్యేక నిధులు తీసుకువచ్చామని, ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించామని అధికార కూటమి ప్రచారం చేసుకుంటోంది. మరోవైపు, తమ హయాంలోనే ఫేజ్–1 ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించి, 41.15 మీటర్ల పరిమితికి అనుగుణంగా సాంకేతిక అనుమతులు సాధించామని, ఆ కష్టఫలమే నేడు కేంద్రం ఇచ్చిన ఆమోదమని వైఎస్ఆర్‌సీపీ తమ ఖాతాలో వేసుకునే యత్నం చేస్తోంది.ఈ పొలిటికల్ డిబేట్‌లో ఇరుపక్షాలు విసురుకుంటున్న ఆరోపణలు, ప్రత్యారోపణలు క్షేత్రస్థాయి వాస్తవాలను దాచిపెడుతున్నాయి. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వం 70 శాతానికి పైగా పనులు పూర్తి చేసిందని, డయాఫ్రమ్ వాల్‌తో సహా ప్రధాన నిర్మాణాలను వేగవంతం చేసిందని టీడీపీ శ్రేణులు చెప్తున్నాయి. కానీ, 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్‌సీపీ రివర్స్ టెండరింగ్ పేరుతో ఏజెన్సీని మార్చడం వల్ల ప్రాజెక్టు ఆలస్యమైందని, 2020 గోదావరి వరదల్లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడానికి జగన్ సర్కార్ అజ్ఞానమే కారణమని టీడీపీ తీవ్రంగా కౌంటర్ ఇస్తోంది. దానికి పోటీగా, పోలవరం కాంట్రాక్టులను నాటి టీడీపీ ప్రభుత్వం తమ అనుకూల ఏజెన్సీలకు కట్టబెట్టి అంచనాలు పెంచేసిందని, తాము వచ్చి అవినీతిని అరికట్టి నిధులను సద్వినియోగం చేశామని వైఎస్ఆర్‌సీపీ కౌంటర్ ఇస్తోంది.ఈ క్రెడిట్ గేమ్ లో పొలిటికల్ లీడర్లు ఎవరు పైచేయి సాధించినా.. ప్రజా క్షేత్రంలో మాత్రం అసలైన విజేత ప్రాజెక్టు పూర్తయినప్పుడే తేలుతుంది. కేవలం మాటల విన్యాసాల వల్ల ఓటర్లు ఓట్లేయరనేది గత అనుభవాలు నిరూపించాయి. జగన్ హయాంలో రివర్స్ టెండరింగ్ వల్ల ప్రాజెక్టు ఐదేళ్లు వెనక్కి వెళ్లడమే కాకుండా, రూ.15,000 కోట్ల మేర ఆర్థిక నష్టం జరిగిందనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. అందుకే, ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం క్రెడిట్ దక్కించుకోవాలంటే కేవలం వైఎస్ఆర్‌సీపీపై నిందలు వేస్తే సరిపోదు; అనుకున్న గడువులోగా గ్రావిటీ ద్వారా నీళ్లను అందించాల్సి ఉంటుంది. కేంద్ర జలశక్తి శాఖ రాజ్యసభ వేదికగా స్పష్టం చేసిన వివరాల ప్రకారం, ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే కాంక్రీట్ పనులు 98.84%, ప్రధాన కాలువల తవ్వకం 98.96% వరకు పూర్తయ్యాయి. అయితే, దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ స్థానంలో కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం, ఎర్త్–కమ్–రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణం పూర్తికావడం అత్యంత కీలకమైన సవాలు. కేంద్ర జలశక్తి శాఖ అంచనాల ప్రకారం తొలి దశ 41.15 మీటర్ల నీటి మట్టం పనులను అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అవసరమైతే మరొక ఏడాది కాలపరిమితి పెరిగినా.. 2027 నాటికి తొలి దశ నీటిని నిల్వ చేసి, కాలువల ద్వారా నీటిని విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. పోలవరం కేవలం కాంక్రీట్ నిర్మాణం మాత్రమే కాదు, అది వేలాది మంది గిరిజనులు, రైతుల పునరావాస సమస్య. ఫేజ్–1 లో దాదాపు 96,660 నిర్వాసిత కుటుంబాలు ఉండగా, ఇప్పటివరకు కేవలం 17,892 కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించారు. నీరు నిల్వ చేయాలంటే మిగిలిన వేలాది కుటుంబాలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు ఇచ్చి ఖాళీ చేయించాలి. కాబట్టి, డ్యామ్ నిర్మాణం 2026–27 నాటికి పూర్తయినా, నిర్వాసితులకు పరిహారం చెల్లించి, నిధుల సమస్య లేకుండా పునరావాసం పూర్తి చేస్తేనే రైతులకు పూర్తిస్థాయిలో నీటి ఫలాలు అందుతాయి. రాజకీయం పక్కనపెట్టి, కేంద్రం ఇచ్చిన నిధులతో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయడమే ఏపీ భవిష్యత్తుకు శ్రీరామరక్ష

# మావిగన్‌కు సమర్థింపుగా అవిగన్ తెస్తున్నారా?

**విజయవాడ, ఆగస్టు 15, పెన్ పవర్:**
మాజీ మంత్రి, వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేత పేర్ని నాని ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమరావతి రాజధానిని అవిగన్ అమరావతి – విజయవాడ – గుంటూరు గా సిఆర్‌డిఏ లో తీర్మానం చేశారని, త్వరలోనే కేబినెట్ ముందుకు తీసుకురాబోతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన మావిగన్ కాస్తా ఇప్పుడు అవిగన్ గా మారిందని ఆయన సెటైర్లు వేశారు. అది జగన్ ఎఫెక్ట్ అంటున్నారు. మొదటగా సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌ను గమనిస్తే.. 2015లో అమరావతిని రాజధానిగా ప్రకటించినప్పటి నుంచీ విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, తెనాలి సహా చుట్టుపక్కల వందలాది గ్రామాలు సీఆర్డీఏ పరిధిలోనే ఉన్నాయి. కోర్ క్యాపిటల్ సిటీగా 217 చదరపు కిలోమీటర్ల అమరావతి ప్రాంతం ఉంటే, దాని సమగ్ర అభివృద్ధికి 8,300 చదరపు కిలోమీటర్లకు పైగా విస్తీర్ణాన్ని సీఆర్డీఏ పరిధిగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పుడు ప్రత్యేకంగా అవిగన్ పేరుతో క్రొత్తగా ఏదో తీర్మానం చేస్తున్నారని నాని చెప్పడం కేవలం ఒక కొత్త రాజకీయ అస్త్రాన్ని ప్రయోగించడమే తప్ప, అందులో కొత్తగా చట్టపరమైన మార్పు ఏదీ లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే, పేర్ని నాని వ్యాఖ్యల్లో అంతర్లీనంగా ఉన్న రాజకీయ మార్పును గమనించాల్సి ఉంది ఐదేళ్ల పాటు మూడు రాజధానుల మంత్రం జపించి, అమరావతిని కేవలం ఒక రియల్ ఎస్టేట్ భ్రమ అని వర్ణించిన వైఎస్ఆర్‌సీపీ నేతలు.. ఇప్పుడు అమరావతి, విజయవాడ, గుంటూరు ప్రాంతాల అనుసంధానత గురించి మాట్లాడుతున్నారు. జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో అమరావతిని పక్కనపెట్టడం వల్ల కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పార్టీ తీవ్రంగా దెబ్బతిన్నది. 2024 ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల్లో వైఎస్ఆర్‌సీపీ



ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న తర్వాత, అమరావతి ఉనికిని పూర్తిగా వ్యతిరేకించడం పార్టీ ఉనికికే ప్రమాదమని గుర్తించినట్లే కనిపిస్తోంది.ఈ పరిణామం వైఎస్ఆర్‌సీపీ అమరావతికి జై కొడుతోందా అనే ప్రశ్నకు ప్రత్యక్షంగా అవును అని చెప్పలేకపోయినా, పరోక్షంగా యు–టర్న్ తీసుకుంటోందనే సంకేతాలనైతే ఇస్తోంది. రాజధాని నిర్మాణాన్ని నేరుగా అంగీకరిస్తే ఇన్నాళ్లూ తమ స్టాండ్ తప్పని ఒప్పుకున్నట్లు అవుతుంది. అందుకే, అమరావతి అభివృద్ధిని, సీఆర్డీఏ విస్తరణను కూటమి ప్రభుత్వం మళ్లీ మాట మారుస్తోంది అని నిందించే క్రమంలో అవిగన్ అనే పదాన్ని తెరపైకి తెచ్చారు. రాజధాని వ్యయాన్ని, నగరాల ఏకీకరణను ప్రశ్నించే పేరుతో అమరావతి చర్చలోకి వైఎస్ఆర్‌సీపీ మళ్లీ ప్రవేశించే యత్నం చేస్తోంది.ప్రభుత్వం వైపు నుంచి చూస్తే.. అమరావతిని కేవలం పాలనా నగరంగానే కాక, విజయవాడ, గుంటూరులను కలుపుతూ విశాలమైన మెగా సిటీ గా మౌలిక వసతులు అభివృద్ధి చేయడం మొదటి నుంచి ఉన్న ప్రతిపాదనే. గ్రీన్ ఫీల్డ్ క్యాపిటల్ అమరావతితో పాటు బ్రౌన్ ఫీల్డ్ నగరాలైన విజయవాడ, గుంటూరులను ఎకనామిక్ కారిడార్లుగా మార్చడం సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్ ముఖ్య ఉద్దేశం. దీనిని ప్రభుత్వం కొత్తగా దాచాల్సిన అవసరం గానీ, జగన్ దెబ్బకు భయపడి మార్చాల్సిన అవసరం గానీ లేదనేది అధికార కూటమి నేతల వాదన. పేర్ని నాని చేసిన అవిగన్ వ్యాఖ్యలు వైఎస్ఆర్‌సీపీ మారుతున్న రాజకీయ సమీకరణాలకు అద్దం పడుతున్నాయి. రాజధానిపై గతంలో తీసుకున్న కఠిన వైఖరిని పక్కనబెట్టి, సీఆర్డీఏ పరిధి, వ్యయం, నగరాల విలీనం వంటి అంశాలపై సాంకేతిక ప్రశ్నలు వేయడం ద్వారా అమరావతి ప్రాంత ప్రజల్లో పోయిన విశ్వాసాన్ని పునరుద్ధరించుకోవడానికి ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. అయితే, ఈ మాటల విన్యాసాలు వైఎస్ఆర్‌సీపీకి ఎంతవరకు రాజకీయ ప్రయోజనం చేకూరుస్తాయో కాలమే నిర్ణయించాలి.

# వైసీపీని ఇరుకున పడేస్తున్న కోర్టు తీర్పు



**విజయవాడ, ఆగస్టు 15, పెన్ పవర్:**
కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్ జరిగింది అంటూ వైఎస్ఆర్‌సీపీ గత కొంతకాలంగా ఉద్యమం చేస్తోంది. అయితే, ఈ ఆరోపణలకు తగిన ఆధారాలు చూపించడంలో వైఎస్ఆర్‌సీపీ ఘోరంగా విఫలమవడంతో ఆ నిరసనలకు పొలిటికల్ మైలేజ్ దక్కలేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. కానీ, అదే సమయంలో గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్–1 మూల్యాంకనంలో ఘోరమైన అక్రమాలు జరిగాయని ప్రత్యేక దర్యాప్తు బృందం హైకోర్టుకు నివేదిక సమర్పించడం ఏపీ రాజకీయాల్లో మైండ్ గేమ్ మార్చేసింది. డీఎస్సీపై ఎలాంటి క్లూస్ ఇవ్వలేకపోయిన వైఎస్ఆర్‌సీపీకి, గ్రూప్–1 కేసు రూపంలో కూటమి ప్రభుత్వానికి అత్యంత పవర్ ఫుల్ ఆయుధం దొరికినట్లయింది.సిట్ దాఖలు చేసిన తాజా నివేదిక ఆధారంగా పరిశీలిస్తే.. వైఎస్ఆర్‌సీపీ హయాంలో నిర్వహించిన గ్రూప్–1 పరీక్షల్లో వ్యవస్థాగతంగా తీవ్రమైన అవకతవకలు జరిగాయని పక్కా నిరూపణలతో సహా బయటపడింది. డిజిటల్ మూల్యాంకనం రద్దు కావడం, హాయ్‌లాండ్ రిసార్ట్‌కు నిబంధనలకు విరుద్ధంగా జవాబు పత్రాలు తరలించడం, ఓఎంఆర్ వాల్యుయేషన్ స్లిప్పులపై సరిదిద్దడం వరకు చోటుచేసుకున్న తీరు షాకింగ్‌గా ఉంది. ల్యాబ్ ఫోరెన్సిక్ రిపోర్టుల ప్రకారం తనిఖీ చేసిన 736 వాల్యుయేషన్ రికార్డుల్లో ఏకంగా 718 రికార్డులలోఅంటే 97.55 శాతం దిద్దుబాట్లు, ఓవర్ రైటింగ్‌లు జరిగాయని తేలడం నాటి వ్యవహారం ఎంత దారుణంగా సాగిందో తెలియజేస్తోంది.ఈ మొత్తం వ్యవహారంలో నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి, సీనియర్ ఐపీఎస్ అధికారి పి.ఎస్.ఆర్. ఆంజనేయులు పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఏపీపీఎస్సీ ఛైర్మన్ అనుమతి లేకుండానే జవాబు పత్రాలను హాయ్‌లాండ్ రిసార్ట్‌కు తరలించి, 84 రోజుల పాటు ప్రైవేట్ ఏజెన్సీ క్యామ్‌సైన్ మీడియా కస్టడీలో ఉంచడం వెనుక ఆయనే కీలక పాత్ర పోషించారని సిట్ గుర్తించింది. దాదాపు రూ.1.14 కోట్ల ప్రజాధనాన్ని సదరు ఏజెన్సీకి అప్పగించి, కేవలం ముందస్తు డిజిటల్ మార్కులను మళ్లీ రావీ= రికార్డుల్లో ఎంట్రీ చేయించేలా డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇప్పించారనే ఆరోపణలు నాడు ఐపీఎస్ అధికారి హోదాలో ఆయన నడిపిన నెట్‌వర్క్‌ను ఎండగడుతున్నాయి. హైకోర్టు ఆదేశాల ప్రకారం మ్యాన్యువల్ వాల్యుయేషన్ చేయాలని చెప్తూనే.. నిబంధనలకు విరుద్ధంగా వైట్‌నర్ వాడటం, సీనియర్ ఎగ్జామినర్ల సంతకాలు లేకపోవడం, కొత్త సంతకాలు కలవకపోవడం, 197 మందికి మార్కులు పెంచి, 222 మందికి మార్కులు తగ్గించడం వెనుక పెద్ద ఎత్తున పొలిటికల్ అండ్ ఫైనాన్షియల్ డీలింగ్స్ ఉన్నట్లు అనుమానాలు బలపడుతున్నాయి. సీఎస్ ఆప్షన్ లేని చోట నాటి వైఎస్ఆర్‌సీపీ పెద్దల ఓరల్ ఇన్‌స్ట్రక్షన్స్ ఆధారంగానే మార్కులు మార్చారని సిట్ రిపోర్ట్ తేల్చిచెప్పడం గేమ్ ఛేంజర్‌గా మారుతోంది. ప్రస్తుతం సర్వీసులో ఉన్న గ్రూప్–1 అధికారులను గనుక సిట్ లోతుగా ప్రశ్నిస్తే మరింత సంచలన విషయాలు బయటకు రావడం ఖాయం. నాటి మూల్యాంకనంలో అసలైన మెరిట్ అభ్యర్థులకు అన్యాయం చేసి, ఎవరెవరికి మార్కులు పెంచి కొలువులు కట్టబెట్టారో లబ్ధిదారులైన అధికారుల మూలాల నుంచి వెలికితీసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. డీఎస్సీ పరీక్షలపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని చూసిన వైఎస్ఆర్‌సీపీ.. ఇప్పుడు గ్రూప్–1 సిట్ నివేదికతో తామే ఇరుక్కుపోయిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల ముందే నిరుద్యోగ ఓట్ బ్యాంకును ఆకట్టుకోవడానికి వైఎస్ఆర్‌సీపీ ప్రయత్నించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం నాటి గ్రూప్–1 స్కామ్‌ను ఎండగడుతూ రివర్స్ కౌంటర్ ఇస్తోంది. ఆధారాలతో సహా ఫోరెన్సిక్ రిపోర్టులు కోర్టుకు చేరడంతో, పిఎస్ఆర్ ఆంజనేయులు సహా ఈ కుంభకోణంలో ప్రమేయమున్న కీలక సూత్రధారులపై చట్టపరమైన ఉచ్చు బిగుసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# సర్వీసులతో భోగాపురం



**విజయనగరం, ఆగస్టు 15, పెన్ పవర్:**
భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో సరికొత్త సందడి నెలకొంది. ఈనెల 17 నుంచి పూర్తిస్థాయిలో విమాన సర్వీసులు ప్రారంభం అవుతాయి. ఈనెల 1న ప్రధాని నరేంద్ర మోడీ ఈ విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేసిన సంగతి తెలిసిందే. అయితే 17 నుంచి విమాన రాకపోకలు ప్రారంభం అవుతాయని పౌర విమానయాన ఇప్పటికే ప్రకటన చేసింది. అయితే దానికి కేవలం రెండు రోజుల గడువు మాత్రమే ఉంది. ప్రైవేటు ఎయిర్లైన్స్ సైతం తమ సర్వీసులను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయి. అయితే తొలి రోజు ఏకంగా 31 సర్వీసులను నడప నుంది ఇండిగో ఎయిర్లైన్స్. హైదరాబాద్, తిరుపతి, బెంగళూరు, చెన్నై సహా పలు నగరాలకు ఈ విమానాలు నడవనున్నాయి. తన తొలి రోజు సర్వీస్ లను ప్రకటించింది ఇండిగో ఎయిర్లైన్స్.ఈనెల 16 అర్ధరాత్రి నుంచి విశాఖ ఎయిర్పోర్ట్ నుంచి విమాన సర్వీసులు రద్దు అవుతాయి. అక్కడ నుంచి సేవలందించే విమానాలన్నీ భోగాపురం నుంచి మొదలవుతాయి. ఈ క్రమంలో విమాన సర్వీసుల రాకపోకలపై ఎయిర్లైన్స్ సంస్థలు ఒక్కొక్కటి షెడ్యూల్ విడుదల చేస్తున్నాయి. ఈ క్రమంలో ఇండిగో విమానయాన సంస్థ తొలి రోజు 31 సర్వీసులను ప్రారంభించనున్నట్లు తెలిపింది. భోగాపురం నుంచి ఆరోజు ఉదయం 8:55, 10:40, మధ్యాహ్నం ఒంటిగంట, సాయంత్రం 4:25, రాత్రి 7:20, 8:40, 9 20 గంటలకు విమానాలు బయలుదేరనున్నాయి. భోగాపురం నుంచి ఢిల్లీకి ఉదయం 8:20, రాత్రి 10:45... బెంగళూరుకు మధ్యాహ్నం 2:55, రాత్రి 9:10, చెన్నైకి మధ్యాహ్నం 12:15, సాయంత్రం 6:35.. కోల్కత్తా కు రాత్రి 7:50, ముంబైకి మధ్యాహ్నం 3:05, తిరుపతికి మధ్యాహ్నం 1:50 గంటలకు విమానాలు అందుబాటులోకి వస్తాయని ఇండిగో తెలిపింది మరోవైపు ఎయిర్ ఇండియా కూడా అక్టోబర్ 24 వరకు భోగాపురం నుంచి నడిచే విమానాల షెడ్యూల్ ను ప్రకటించింది. హైదరాబాదు నుంచి భోగాపురం మధ్య రోజుకు ఐదు సర్వీసులు.. బెంగళూరు నుంచి భోగాపురం మధ్య రోజుకు రెండు సర్వీసులు నడపనుంది. ఆది, శుక్రవారం మినహా మిగిలిన ఐదు రోజులు మరో సర్వీస్ అందుబాటులో ఉంటుంది. విజయవాడ నుంచి భోగాపురం మధ్య రోజుకు నాలుగు సర్వీసులు నడవనున్నాయి. భోగాపురం ఎయిర్పోర్ట్ నుంచి కమర్షియల్ సర్వీసులో తొలి విమానం సింగపూర్ కు వెళ్లనుంది. ఆగస్టు 16న రాత్రి 11:05 గంటలకు స్కూట్ ఎయిర్లైన్స్ విమానం భోగాపురం లో ల్యాండ్ అవుతుంది. ఈ విమానం గంట తర్వాత 12:05 గంటలకు సింగపూర్ బయలుదేరుతుం

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# భారత్‌పై ప్రపంచ దేశాల అభిప్రాయాలు ఎలా ఉన్నాయంటే.. పాకిస్తాన్ లో షాకింగ్ రిజల్ట్!



ప్రపంచ పటంలో భరతమాత స్థానం ఎప్పుడూ ప్రత్యేకం. వివిధ సంస్కృతులు, భిన్నత్వంలో ఏకత్వం, ఆర్థిక వృద్ధి , దౌత్యపరమైన విజయాలతో భారత్ నేడు ప్రపంచ రంగస్థలంపై సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తోంది. తాజాగా వెలువడిన ప్యూ రీసెర్చ్ సెంటర్ అంతర్జాతీయ సర్వే గణాంకాలను గమనిస్తే ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల ప్రజలు భారత్‌ను చూసే కోణంలో వైవిధ్యం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రపంచంలోని ముప్పై ఆరు దేశాల్లో నిర్వహించిన ఈ అధ్యయనంలో సగటున నలభై ఐదు శాతం మంది భారత్ పట్ల అపారమైన అభిమానాన్ని సానుకూల దృక్పథాన్ని ప్రకటిస్తే నలభై ఒక్క శాతం మంది విభిన్న అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సంఖ్యల మధ్య అంతరం స్వల్పంగానే అనిపించినప్పటికీ ఆ సంఖ్యల వెనుక ఉన్న కథనాలు, మానవ సంబంధాలు భారతదేశ అంతర్జాతీయ ప్రస్థానానికి స్ఫూర్తిదాయక నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ సర్వే ఫలితాల్లో అత్యంత ఆసక్తికరమైన, గర్వకారణమైన విషయం శ్రీలంక ప్రజలు చూపిన ప్రేమాభిమానాలు. మన పొరుగున ఉన్న శ్రీలంకలో ఏకంగా డెబ్బై తొమ్మిది శాతం మంది ప్రజలు భారతదేశానికి జై కొట్టారు. కష్టకాలంలో చేయూతనందించి సంక్షోభంలో అండగా నిలిచిన భారత్ ఉదార స్వభావాన్ని, సదాశయాన్ని వారు హృదయపూర్వకంగా స్వీకరించారని ఈ స్పందన నిరూపిస్తోంది. సాంస్కృతిక సారూప్యతలు, చారిత్రక అనుబంధం, నిరంతరం కొనసాగే ద్వైపాక్షిక సహాయం అక్కడ విశ్వాసానికి బలమైన పునాదిగా మారాయి.కేవలం ఆసియా ఖండానికే పరిమితం కాకుండా ఐరోపా సమాజంలోనూ భారత్ తన పటిష్టమైన ముద్రను వేసింది. బ్రిటన్‌లో డెబ్బై ఒక్క శాతం మంది.. జర్మనీలో అరవై మూడు శాతం మంది ప్రజలు భారతదేశ సాంకేతిక పురోగతిని, ప్రజాస్వామ్య విలువలను సంస్కృతిని మనస్ఫూర్తిగా అభినందించారు. వ్యాపార రంగంలో భారత్ చూపిస్తున్న ప్రతిభ, విదేశాల్లో స్థిరపడిన భారతీయుల నిబద్ధత అక్కడ సానుకూల వాతావరణాన్ని పెంపొందించాయి.అయితే ప్రతి గొప్ప ప్రయాణంలోనూ సవాళ్లు సహజం. పొరుగుదేశమైన పాకిస్థాన్‌లో కేవలం ఏడు శాతం మందే సానుకూలత చూపడం చారిత్రక ప్రాధాన్యం ఉన్న సమస్యలను ప్రతిబింబిస్తుండగా.. అమెరికాలో నలభై ఐదు శాతం అనుకూలత, యాభై శాతం విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవ్వడం అంతర్జాతీయ వ్యూహాత్మక సంబంధాల సంక్లిష్టతను తెలుపుతోంది. భిన్నాభిప్రాయాలు ఉన్న చోట కూడా సంభాషణ ద్వారా విశ్వాసాన్ని నిర్మించుకోవడానికి ఇవి కొత్త అవకాశాలను అందిస్తున్నాయి.అంతిమంగా ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతున్న ఈ మిశ్రమ స్పందనలు భారత్ అంతర్జాతీయంగా ఎదుగుతున్న క్రమంలో ఎదురవుతున్న మైలురాళ్లు మాత్రమే. సామరస్యం, ఆర్థిక ప్రగతి విశ్వశాంతి దిశగా భారత్ సాగిస్తున్న స్ఫూర్తిదాయక ప్రయాణానికి ఈ గ్లోబల్ సర్వే ఒక దర్పణంలా నిలుస్తోంది.

# రూ.కోటిన్నర ఖర్చుతో డెస్టినేషన్ వెడ్డింగ్!



పెళ్లిళ్లు ఘనంగా చేయటమంటే.. సదూరాన ఉండే ప్రాంతాల్లో గ్రాండ్ గా చేయటమే ఇప్పుడు ట్రెండ్ గా మారింది. దేశ ప్రధాని నరేంద్ర మోడీ సైతం డెస్టినేషన్ వెడ్డింగ్ కంటే దేశీయంగా పెళ్లిళ్లు చేసుకోవాలని చెప్పినా.. జనాలు తమ మైండ్ సెట్ ను మార్చుకోవటానికి సిద్ధంగా లేరు. దీనికి కారణం తమ జీవితంలో ఒకేసారి జరిగే పెళ్లిని వీలైనంత వైభవంగా.. తాము కోరుకున్నట్లుగా ప్లాన్ చేసుకోవటానికే ప్రాధాన్యతను ఇస్తున్నారు. దీంతో.. డెస్టినేషన్ వెడ్డింగ్ ట్రెండ్ అంతకంతకూ పెరుగుతోంది.గతంలో పెళ్లిళ్లను గ్రాండ్ గా చేయటమంటే భారీగా డెకరేషన్ చేయటం.. భారీ మెనూ సిద్ధం చేయటమే. కానీ.. ఇప్పుడు వీటన్నింటితో పాటు తమ సన్నిహితులకు వీలైనన్ని భారీ వసతులు కలిగించటమే కాదు.. తమ సన్నిహితులకు.. బంధువులకు తమ ఇంట్లో జరిగే వివాహ వేడుక ఒక థ్రిల్ కలిగించటంతో పాటు.. మర్చిపోలేని అనుభవాన్ని మిగల్చాలన్న తపన ఎక్కువ అవుతుంది. ఖర్చుకు వెనుకాడని తత్త్వం కూడా దీనికి ప్రధాన కారణంగా చెప్పొచ్చు. దీంతో.. డెస్టినేషన్ వెడ్డింగ్స్ జోరు అంతకంతకూ పెరుగుతోంది.

ఆసక్తికర అంశం ఏమంటే.. ఇటీవల కాలంలో మారిన పరిస్థితులకు అనుగుణంగా డెస్టినేషన్ వెడ్డింగ్స్ కోసం వేదికల్ని మార్చేస్తున్న వైనం కనిపిస్తోంది. ఒకప్పుడు డెస్టినేషన్ వెడ్డింగ్స్ అంటే దుబాయ్.. ఒమన్.. టర్కీలాంటి పశ్చిమాసియా దేశాలు సంపన్న భారత కుటుంబాల పెళ్లిళ్లకు వేదికగా ఉంటే.. ఇప్పుడు ఆ స్థానాన్ని శ్రీలంక.. వియత్నాం.. థాయ్ లాండ్.. ఇండోనేషియాలు వేగంగా ఆక్రమిస్తున్నాయి.సంపన్నులు మాత్రమే కాదు ఎగువ మధ్యతరగతి కుటుంబాలు సైతం డెస్టినేషన్ మ్యారేజ్ వైపునకు మొగ్గేలా పరిస్థితులు ఉంటున్నాయి. డెస్టినేషన్ వెడ్డింగ్ ట్రెండ్ కు సంబంధించి తాజాగా వెడ్ మి గుడ్ రిపోర్టు ఒకటి వెల్లడించింది. దీని ప్రకారం గత ఏడాది ఒక్క శ్రీలంకలో భారతీయ డెస్టినేషన్ వెడ్డింగ్స్ కు డిమాండ్ 25 శాతం పెరిగిందని.. రానున్న సంవత్సరాల్లోనూ ఇదే స్థాయిలో వృద్ధి రేటు కంటిన్యూ అయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. వివాహాలను విదేశాల్లో గ్రాండ్ గా చేసుకోవాలన్న ఆసక్తి భారతీయుల్లో ఎక్కువైందన్న అభిప్రాయాన్ని ఈ రిపోర్టు వెల్లడించింది.డెస్టినేషన్ వెడ్డింగ్స్ కు శ్రీలంక.. ఇతర దేశాలు ఉన్నప్పటికి భారతీయుల తొలి ఎంపిక మాత్రం థాయ్ లాండ్ గా చెబుతున్నారు. ఇటీవల కాలంలో పెళ్లి వేడుకలను ఎక్కువ రోజులు చేస్తున్నపరిస్థితి. పాతకాలంలో ఏడు రోజుల పెళ్లి మాదిరి రోజులు తిరిగి వస్తున్నాయి. కరోనాకు ముందు సగటున ఒకట్రెండు రోజులు జరిగే డెస్టినేషన్ వెడ్డింగ్స్ ఇప్పుడు మూడు.. నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. పెళ్లికి భారతీయులు చేసే బడ్జెట్ కూడా పెరిగింది. దీనికి తగ్గట్లే విదేశాల్లో పెళ్లి చేసుకోవటానికి అయ్యే ఖర్చును చాలామంది పెద్దగా పట్టించుకోవటం లేదు.ఒక అంచనా ప్రకారం శ్రీలంకలో విలాసవంతంగా పెళ్లి చేసుకోవాలంటే రూ.కోటిన్నర సరిపోతుందని చెబుతన్నారు. నిజానికి పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా విమాన ఛార్జీలు పెరిగినప్పటికి.. చాలామంది సంపన్నులు మాత్రం తమ డెస్టినేషన్ మ్యారేజ్ ను మార్చుకోవాలన్న ఆలోచన చేయకపోవటం గమనార్హం. విదేశాల్లో జరిగే డెస్టినేషన్ మ్యారేజ్ కు థాయ్ లాండ్.. ఇండోనేషియాలోని బాలి.. వియత్నాం.. శ్రీలంక.. మలేషియా.. ఇటలీ.. ఫ్రాన్స్.. గ్రీస్.. స్పెయిన్.. పోర్చుగల్ దేశాలు అత్యధికుల్ని ఆకర్షిస్తున్నాయి. అదే దేశీయంగా డెస్టినేషన్ మ్యారేజ్ లకు డెహ్రాడూన్.. ముస్సోరీ.. రిషికేశ్.. సిమ్లా.. జిమ్ కార్బెట్ టాప్ 5 ఛాయిస్ గా ఉంటున్నాయి. రాయల్ కం లగ్జరీ డెస్టినేషన్ వెడ్డింగ్స్ కు ఉదయ్ పూర్.. జైపూర్.. జైసల్మేర్.. జోధ్ పూర్.. గోవాలు కూడా హాట్ ఛాయిస్ గా నిలుస్తున్నట్లుగా చెప్పాలి.

# చైనాలో వైరల్ అవుతున్న 'ప్రీ-మేడ్ చిల్డ్రన్' ట్రెండ్.. పిల్లల బాల్యాన్ని చదువుతోనే నింపేస్తున్నారా?



ప్యాకెట్ విప్పడం.. మైక్రోవేవ్‌లో పెట్టడం.. రెండు నిమిషాల్లో తినేయడం.. 'ప్రీ-మేడ్ మీల్స్' కథ మనకు తెలిసిందే. కానీ ఇప్పుడు చైనాలో వంటకాల స్థానంలో పిల్లలను పెట్టేశారు.. అదేనండీ సోషల్ మీడియాను ఊపేస్తున్న 'ప్రీ-మేడ్ చిల్డ్రన్' ట్రెండ్. పిల్లల బాల్యాన్ని చదువు అనే ఫ్రీజర్‌లో పెట్టి ఐదో తరగతిలోనే పదో తరగతి సిలబస్‌ను మైక్రోవేవ్ చేసి ర్యాంకుల రూపంలో బయటకు తీసే కొత్త రకం "రెడీ-టు-ఈట్" పెంపకమిది.సెలవులంటే మనకు గుర్తొచ్చేవి మామిడికాయలు, సైకిల్ రేసులు, పిన్నిగారింటి అల్లర్లు. కానీ ఈ 'ప్రీ-మేడ్' రెసిపీలో అవన్నీ అవుట్‌డేటెడ్. వచ్చే ఏడాది సిలబస్ ఇప్పుడే నమలాలి.. అదనపు ట్యూషన్ల స్టీమ్‌లో ఉడకాలి.. ఎగ్జామ్ మోడ్‌లో 24/7 మరగాలి. పక్కింటి బబ్లూ కంటే మన బంటి రెండు చాప్టర్లు ముందే ఉండాలి.. అదీ అసలు సీక్రెట్ ఇంగ్రీడియంట్..

**ఫ్యాక్టరీ ప్రోడక్ట్స్ జం సహజ బాల్యం**

పిల్లలకు ఆటపాటలు.. సృజనాత్మకత.. కాసేపు హాయిగా నిద్రపోవడం అంటే... అయ్యో అవేమైనా మార్కులు తెచ్చిపెడతాయా ఏంటి? 'పాయింట్ వన్' శాతంలో ర్యాంకు పోతే సమాజం

ఏమనుకుంటుంది? అందుకే తల్లిదండ్రులు తమ ప్రేమను డిజైనర్ కోచింగ్ సెంటర్ల ఫీజుల రూపంలో కురిపిస్తున్నారు. ఫలితంగా... బొమ్మలు పట్టుకోవాల్సిన చేతులు ర్యాంక్ కార్డులను మోస్తూ సృజనాత్మకతను బకెట్లో పడేసి యంత్రాల్లా మారే 'పర్‌ఫెక్ట్ ప్రోడక్ట్స్' తయారవుతు న్నాయి. ఈ అత్యంత సమర్థవంతమైన 'ప్యాకేజింగ్' వెనుక ఉన్న చిన్న సమస్య ఏమిటంటే పిల్లలు రోబోలు కారు. నిరంతర ఒత్తిడి, పోటీ మానసిక భావనలు వారిలోని ఆనందాన్ని పీల్చేస్తున్నాయి. మార్కులు, ర్యాంకులు మాత్రమే జీవితానికి కొలమానం అనుకుంటే భవిష్యత్తులో ఆ ప్యాకెట్ ఓపెన్ చేశాక లోపల 'అసలైన వ్యక్తిత్వం' ఉందో లేదో వెతుక్కోవాల్సి వస్తుంది. పిల్లలను ముందుగానే రెడీ చేసి మార్కెట్లో పెట్టే 'ప్రీ-మేడ్' మోజు స్వస్తి చెప్పాలి. చదువుతో పాటు ఆటలు, విశ్రాంతి, స్వయంగా నేర్చుకునే స్వేచ్ఛ ఇచ్చినప్పుడే బాల్యం పరిపూర్ణమవుతుంది. లేదంటే భవిష్యత్తులో మనం చూసేది కేవలం సర్టిఫికెట్ల మోత తప్ప నవ్వుతూ జీవించే మనుషులను కాదు..

# రూ.వేల కోట్ల వ్యాపారం.. రాపిడో, ఓలా, ఊబర్ ఫోన్ నెంబర్లు ఇవ్వరేం?




మౌనం వీడాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రశ్నించాల్సిన పరిస్థితి వచ్చేసింది. ప్రభుత్వాలు సైతం మొద్దునిద్ర వీడి.. కార్పొరేట్ సంస్థలు చేసే విన్యాసాలకు చెక్ పెట్టేయటమే కాదు.. తాము రూపొందించిన నిబంధల్ని సదరు సంస్థలు పక్కాగా ఫాలో అవుతున్నాయా? లేదా? అన్నది తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది. వేలాది కోట్ల రూపాయిల టర్నోవర్ చేసే సంస్థలు.. తమ సేవల్ని వినియోగించే వినియోగదారులకు అత్యవసర పరిస్థితి ఏర్పడితే నేరుగా మాట్లాడేందుకు కనీసం సమకూర్చాల్సిన ఫోన్ నెంబరు.. సంప్రదించటానికి తమ ఆఫీసు ఎక్కడ ఉందన్న వివరాల్ని కనీసం పేర్కొనకుండా వేలాది కోట్ల రూపాయిలు టర్నోవర్ చేసే తీరు మన దేశంలోనే ఉంటుందేమో?

అది టూ వీలర్ కావొచ్చు. త్రీవీలర్ కావొచ్చు.. ఫోర్ వీలర్ కావొచ్చు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మహానగరాలు..నగరాలు.. కొన్ని పట్టణాలకు చెందిన ఎంతోమంది యాప్ ఆధారిత రవాణా సేవల్ని వినియోగిస్తున్నారు. వీరికి సేవలు అందించే సంస్థలు దేశంలో చాలానే ఉన్నాయి. అయితే.. పెద్ద ఎత్తున నెట్ వర్క్ తో పాటు.. భారీ టర్నోవర్ చేసే సంస్థల్లో ఊబర్.. ఓలా.. రాపిడో తదితర సంస్థలు ఉన్నాయి. ఆశ్చర్యపరిచే అంశం ఏమంటే.. వీటిని వినియోగించే వారికి ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే.. చాట్ బాట్ ద్వారా సంప్రదింపులు జరపాలే తప్పించి.. నేరుగా ఫోన్ చేసే సౌకర్యం ఉండదు. కనీసం వారి కస్టమర్ కేర్ వివరాలు కూడా ఇవ్వకపోవటం కనిపిస్తుంది.

తాజాగా ఢిల్లీలో రాపిడో సేవల్ని అందుకున్న ఒక మహిళకు షాకింగ్ అనుభం ఎదురుకావటం.. బైక్ డ్రైవర్ వ్యవహారశైలి ఆందోళనకు గురికావటంతో ఆమె.. వేగంగా వెళుతున్న బైక్ మీద నుంచి దూకేయటం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె రాపిడో కస్టమర్ కేర్ ను సంప్రదించే ప్రయత్నం చేయగా.. సరిగా స్పందించకపోవటం.. తనకు ఎదురైన షాకింగ్ అనుభవం గురించి సోషల్ మీడియాలో వివరాలు షేర్ చేయటంతో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. అప్పుడు కానీ రాపిడో స్పందించి.. తగిన చర్యలు తీసుకుంటున్నట్లుగా చెప్పటం.. వైద్య సాయంతో పాటు.. లీగల్ సాయం చేస్తామన్న మాటనను చెప్పటం చూస్తే.. సోషల్ మీడియాలో వెల్లువెత్తిన విమర్శలే రాపిడో రియాక్టు అయ్యేలా చేశాయని చెప్పక తప్పదు.

రాపిడో.. ఓలా.. ఊబర్ లాంటి సంస్థలు దేశంలో జరుపుతున్న వ్యాపారం.. దాని టర్నోవర్ చూస్తే.. విస్మయానికి గురి కావాల్సిందే. అంతేకాదు.. దేశం మొత్తంగా ఈ తరహా వ్యాపారం చేసేందుకు ఉన్న మార్కెట్ సైజ్ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. మార్కెట్ వర్గాల అంచనా ప్రకారం దేశంలోయాప్ ఆధారిత రవాణా సేవలు అందించే మార్కెట్ సైజు దాదాపు రూ.60 వేల కోట్ల వరకు ఉంటుందని చెబుతున్నారు. పేరున్న బ్రాండ్లుగా చలామణి అయ్యే ఊబర్ ఇండియా ఏటా రూ.3849కోట్ల టర్నోవర్ చేస్తుంటే.. ఓలా కన్స్యూమర్ రూ.2245 కోట్లు కేవలం రైడ్స్ టర్నోవర్ నమోదు చేస్తోంది. ఇక.. వేగంగా విస్తరిస్తున్న రాపిడో విషయానికి వస్తే సంస్థ పేర్కొన్న టర్నోవర్ లెక్కల ప్రకారం ఈ సంస్థ రూ.1003 కోట్లుగా పేర్కొంది. ఇక్కడో ఆసక్తికర అంశాన్ని ప్రస్తావించాలి. వేలాది కోట్ల రూపాయిల టర్నోవర్ చేసే ఈ సంస్థలన్నీ కూడా తాము నష్టాల్లోనే ఉన్నట్లుగా పేర్కొంటున్నారు.

తాము అందించే సేవల్ని నిత్యం లక్షలాది మంది వినియోగిస్తున్నప్పటికి.. సదరు సంస్థల్ని నేరుగా సంప్రదించటానికి ఒక ఫోన్ నెంబర్ కానీ.. వారి చిరునామాలు కానీ యాప్ లో ఎక్కడా పేర్కొనే పరిస్థితి లేదు. అంటే.. ఫోన్ నెంబరు.. వ్యాపార అడ్రస్ లేకుండానే వేలాది కోట్ల వ్యాపారం చేయటం చూస్తే.. లోపం ఎవరిది? దీనికి బాధ్యులు ఎవరు? అన్న సందేహం కలుగకమానదు. తమ కస్టమర్ కేర్ ఫోన్ నెంబర్లు కానీ వీటి ఆఫీసులు ఎక్కడ ఉన్నాయన్న వివరాల్ని లక్షలాది మంది ప్రజలకు అందుబాటులో ఉంచకుండా వ్యాపారం చేయటం.. ఏదైనా సంప్రదింపులు జరపాలంటే చాట్ బాక్స్ లు.. ఈ మెయిల్ ద్వారానే కమ్యూనికేషన్ జరుపుతామని ఈ సంస్థలు చెబుతుంటాయి.

మన దేశంలోనే ఇలాంటి పరిస్థితి ఉందా? విదేశాల్లో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయన్నది చూస్తే.. మన దేశంలో చట్టాల రూపకల్పన.. నిబంధనల అమలు విషయంలో ప్రభుత్వాలు ఎంతలా వైఫల్యం చెందుతున్నాయో ఇట్టే అర్థమవుతుంది. అమెరికా, ఐరోపా దేశాల్లో ఊబర్ సంస్థ మన దేశంలో మాదిరే కాంటాక్టునెంబర్లు ఇవ్వకుండా యాప్ ద్వారానే సమస్యలు పరిస్కరిస్తామని చెప్పేది. కనీస ఖర్చులతో ఎక్కువ వ్యాపారం పేరుతో ఈ సంస్థలు చెబుతున్నా.. వినియోగదారుల రక్షణ విషయంలో అక్కడి ప్రభుత్వాలు కచ్చితంగా వ్యవహరింటంతో తమ తీరును మార్చుకొని 24 గంటలూ ఫోన్ సపోర్టుతో పాటు..కస్టమర్ సపోర్టు నంబర్లు వెల్లడించాలని రవాణా శాఖలు చట్టాలు తీసుకొచ్చాయి. దీంతో రైడ్ మధ్యలో ఏదైనా సమస్య వస్తే నేరుగా మాట్లాడే సౌకర్యం అక్కడ ఉంది.

మనదేశంలో చట్టాలు ఉన్నప్పటికి వాటిని అమలు చేసే నిఘా వ్యవస్థ చాలా బలహీనంగా ఉండటంతో సదరు కంపెనీలు దాన్ని తమకు అనుగుణంగా మార్చుకుంటున్నాయి. తమ ఫోన్ నెంబరు.. అడ్రస్ వివరాల్ని వెల్లడించకపోవటానికి కారణం.. వీలైనంతగా వినియోగదారులకు అందుబాటులో ఉండకుండా ఉండటమే అన్న విమర్శ ఉంది. అదేమంటే.. చట్టంలో ఫోన్ నెంబరు.. చిరునామా వివరాలు వెల్లడించాల్సిన నిబంధన లేదన్న మాటను చెప్పే పరిస్థితి. నిజానికి వీరినుంచి ఎలాంటి కమ్యూనికేషన్ రాని పరిస్థితి. ఢిల్లీ ఉదంతాన్ని తీసుకున్నా.. తొలుత సంస్థ పెద్దగా రియాక్టు కాలేదు. ఎప్పుడైతే సోషల్ మీడియాలో బాధితురాలి వీడియో వైరల్ అయ్యిందో.. అప్పుడు మాత్రమే స్పందించిన వైనం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుందని చెప్పాలి.మనదేశంలో రవాణా అనేది రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి వస్తుంది. కేంద్రప్రభుత్వం కేవలం మార్గదర్శకాల్ని మాత్రమే ఇవ్వగలదు. వాటిని కచ్చితమైన చట్టంగా మార్చి అమలు చేయాల్సింది రాష్ట్ర ప్రభుత్వాలే. కేంద్రం ఉత్తర్వులు ఇచ్చిన వెంటనే కంపెనీలు కోర్టుకువెళ్లి.. తమ రాష్ట్ర ప్రభుత్వం ఇంకా సదరు నిబంధనల్ని నోటిఫై చేయలేదు కాబట్టి.. తాము సమయం తీసుకుంటామని తప్పించుకుంటాయన్న విమర్శ ఉంది. ఈ కంపెనీలు తమ వ్యాపార లాభాలకే అధిక ప్రాధాన్యత ఇస్తాయన్న విమర్శ ఉంది. రైడ్ త్వరగా దొరకటానికి కస్టమర్ల నుంచి అదనంగా వసూలు చేసే అడ్వాన్స్ టిప్ లాంటి ఫీచర్లు నిబంధనలకు విరుద్ధమని కేంద్రం చెప్పినా.. కంపెనీలు వాటి ద్వారా వచ్చే లాభాల కోసం అలాంటి నిబంధనల్ని అమలు చేసే విషయంలో వాయిదా వేస్తాయన్న విమర్శ ఉంది.ఒకవేళ ప్రభుత్వాలు ఏదైనా కఠిన నిబంధనలు తీసుకొస్తే.. వాటిని తాము అమలు చేయటానికి సమయం పడుతుందని.. సాంకేతికంగా మార్పులు చేయాల్సి ఉంటుందన్న సాకులు చెబుతూ కోర్టులను ఆశ్రయించటం.. స్టే ఆర్డర్ తో కాలయాపన చేయటం లాంటివి చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. చట్టాలు చేసిన తర్వాత వాటిని సదరు కంపెనీలు అమలు చేస్తున్నాయా? లేదా? అన్న అంశాల్ని తనిఖీ చేసే కఠినమైన నిఘా వ్యవస్థ రవాణా శాఖ వద్ద లేకపోవటం అతి పెద్ద లోపంగా చెబుతారు. ఈ మధ్యన అంటే.. ఆగస్టు11న కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన మోటార్ వాహన అగ్రిగేటర్ గైడ్ లైన్స్ ప్రకారం తక్షణమే అమలు చేయాల్సిన ఆదేశాల్లో.. కంపెనీలు ఎలాంటి సాకులు చెప్పకుండా ఓలా, ఊబర్.. రాపిడో లాంటి సంస్థలు తాము అందించే సేవల్లో రైడ్ కన్ఫర్మ్ అయ్యేందుకు అదనపుడబ్బులు అడిగే అడ్వాన్స్ టిప్ .. ఇంప్రూవ్ ఛాన్సెస్ లాంటి ఫీచర్లను వెంటనే తొలగించాలని స్పష్టం చేసింది.

అయితే.. ఈ నిబంధనల మార్గదర్శకాల్ని జాతీయ స్థాయిలో కేంద్రం విడుదల చేసినా.. వాటిని చట్టబద్ధంగా అమలు చేసే పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. కేంద్ర మార్గదర్శకాలు విడుదలైన మూడు నెలల లోపు అన్ని రాష్ట్రాలు.. కేంద్రపాలిత ప్రాంతాలు ఈ నిబంధనల్ని తమ స్థానికచట్టాల్లో చేర్చుకొని అమలు చేయాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే.. కేంద్రం చేసిన మార్గదర్శకాలకు తెలంగాణ.. మహారాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాయి. తెలంగాణ ప్రభుత్వం యాప్ ఆధారిత క్యాబ్.. బైక్ ట్యాక్సీ సేవల్ని నియంత్రించటానికి.. ప్రయాణికుల భద్రతను పెంచటానికి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి అనుగుణంగా తెలంగాణ మోటార్ వాహన అగ్రిగేటర్ పాలసీని త్వరలో పూర్తిస్థాయిలో అమలు చేసేలా ప్లాన్ చేస్తోంది. మరోవైపు మహారాష్ట్ర ప్రభుత్వం కొత్త రూల్స్ ను నోటిఫై చేయటమే కాదు.. ఆ రాష్ట్రంలోని అన్ని యాప్ ఆధారిత రవాణా సంస్థలు ఈ ఏడాది సెప్టెంబరు 1 లోపు కొత్త నిబంధనల ప్రకారం తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని గడువు విధించారు.చివరగా ఒక ఆశ్చర్యకరమైన అంశాన్ని ప్రస్తావించాలి. యాప్ ఆధారిత రవాణా సేవల్ని అందించే సంస్థలు తమ కస్టమర్ కేర్ నంబర్ ను యాప్ లో బహిరంగంగా అందుబాటులో ఉంచాలనే కచ్చితమైన చట్టపరమైన నిబంధన మన దేశంలో లేదు.దీనికి కారణం.. దేశంలో అమలవుతున్న పాత ఐటి చట్టాలు.. వినియోగదారుల రక్షణ నిబంధనలు.. మోటార్ వాహనాల చట్టాల్లోని కొన్ని లోపాలుగా చెప్పాలి. ప్రస్తుతం ఈ కామర్స్ వినియోగదారుల రక్షణ చట్టాల ప్రకారం ఒక డిజిటల్కంపెనీ తన వినియోగదారుల సమస్యలను పరిష్కరించటానికి ఒక ఫిర్యాదుల అధికారిని నియమించి.. అధికారిక మెయిల్ ఐడీ లేదంటే చాట్ బాక్స్ ఇస్తే చట్టపరంగా సరిపోతుంది అదే సమయంలో కస్టమర్లు నేరుగా ఫోన్ చేసి మాట్లాడటానికి 24/7అందుబాటులో ఉండేలా నెంబర్ అంతేకాదు.. తాము సేవలు అందించే ప్రతి నగరంలోనూ ఒక భౌతిక కార్యాలయాన్ని ఏర్పాటు చేసి.. దాని అడ్రస్ ను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలనే నిబందన పాత రవాణా చట్టాల్లో లేదు. తాము కేవలం ఆన్ లైన్ యాప్ మాత్రమే అని చెబుతూ స్థానిక జవాబుదారీతనం లేకుండా తప్పించుకుంటున్నారన్న విమర్శ ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ కొత్తగా తెచ్చిన అగ్రిగేటర్ గైడ్ లైన్స్ ప్రకారం ప్రతి యాప్ సంస్థ కచ్చితంగా తాము సేవలు అందించే రాష్ట్రాల్లో స్థానిక కంట్రోల్ రూం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రైడ్ మధ్యలో ప్రయాణికుడికి ఏదైనా సమస్య వస్తే యాప్ లో "హెల్ప్" బటన్ నొక్కగానే నేరుగా కంపెనీ ప్రతినిధి మాట్లాడేలా 24/7 అత్యవసర ఫోన్ సాయం అందే వ్యవస్థను తప్పనిసరి చేసింది. దీన్ని కొందరు అమలు చేస్తుంటే..మరికొందరు అమలు చేయని పరిస్థితి. అయితే..చట్టాల అమల్లో ఉండే లొసుగుల్ని అసరాగా చేసుకొని తమ వివరాలను కంపెనీలు ప్రజలకు అందుబాటులో ఉంచని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఈ తీరు మారేలా దేశంలోని అన్ని వర్గాలు గళం విప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

భారత జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ ఆపరేషన్ సిందూర్‌పై తొలిసారిగా బహిరంగంగా మౌనం వీడారు. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రసారమైన డిస్కవరీ డాక్యుసిరీస్ 'డిక్లాసిఫైడ్: ఆపరేషన్ సిందూర్'లో.. ఉగ్రవాదానికి పాల్పడేవారికి స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. "భారత్ ఔదార్యాన్ని, సహనాన్ని బలహీనతగా భావించకూడదు. అవసరమైతే భారత్ రిస్క్ తీసుకోగలదు, పరిణామాలతో సంబంధం లేకుండా గట్టిగా దెబ్బతీయగలదు" అంటూ ప్రపంచానికి స్పష్టమైన సందేశమివ్వడం అభినందనీయం. పహల్గాం ఉగ్రదాడికి బాధ్యులైన శిబిరాలను ధ్వంసం చేయడమే 88 గంటల సైనిక చర్య లక్ష్యంగా నిర్దేశించుకున్నామని దోవల్ వెల్లడించారు. 2025 మే 6–7 అర్ధరాత్రి ప్రారంభమైన ఆపరేషన్.. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై కచ్చితమైన దాడులు నిర్వహించింది. సరిహద్దు ప్రాంతాల్లో కాకుండా, పాకిస్తాన్ లోతట్టు ప్రాంతాల్లోకి చొచ్చుకెళ్లి తొమ్మిది లక్ష్యాలను ధ్వంసం చేయగలిగామని, బ్రహ్మోస్ క్షిపణులు, సమీకృత వైమానిక నియంత్రణ వ్యవస్థ వంటి స్వదేశీ సాంకేతికత ఎంత సమర్థంగా పనిచేసిందో దోవల్ గతంలోనూ ఐఐటీ మద్రాస్ స్నాతకోత్సవంలో ప్రస్తావించారు. భారత్‌వైపు ఒక్క అద్దం పగలలేదని, దీనికి ఆధారాలు చూపాలని విదేశీ మీడియాకు దోవల్ సవాలు విసిరారు. వంద మందికిపైగా ఉగ్రవాదులను హతమార్చడంతోపాటు, పలు వ్యూహాత్మక, వైమానిక స్థావరాలను ధ్వంసం చేసిన ఆపరేషన్, మే 10న ఇరు దేశాల మధ్య అవగాహన కుదిరేవరకూ కొనసాగింది. మాజీ సైనిక దళాల చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ సైతం డాక్యుసిరీస్‌లో మాట్లాడుతూ, పహల్గాం దాడి యావత్ దేశాన్నీ కుదిపేసిందని, ఇలాంటి బెదిరింపులకు భారత్ తలొగ్గబోదని నిర్ణయించుకున్నామన్నారు.

ఇదే సమయంలో, దాయాది పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి తన అలవాటైన రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దిగడం గమనార్హం. పాకిస్తాన్ స్వాతంత్ర్య దినోత్సవానికి ఒకరోజు ముందు ఇస్లామాబాద్‌లో 'యాద్గార్–ఎ–ఫతే' (విజయ స్మారకం) ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ, 2025 మే నెల ఘర్షణలను 'మర్కా–ఎ–హక్' (సత్యపోరాటం)గా అభివర్ణిస్తూ, తాము విజయం సాధించామని అసత్య ప్రచారం చేశారు. సింధూ జలాల ఒప్పందంపైనా బెదిరింపు స్వరంతో మాట్లాడుతూ, "పాకిస్తాన్ నీటి వాటాలో ప్రతి బొట్టు మా రెడ్‌లైన్" అని ప్రకటించారు. భారత్ సరైన మార్గంలోకి రాకపోతే ప్రత్యక్షంగా బదులిస్తామనీ హెచ్చరించారు. అయితే, వాస్తవానికి ఈ ప్రేలాపనలు పాక్ ఎదుర్కొంటున్న అంతర్గత సంక్షోభాల నుంచి ప్రజల దృష్టి మళ్లించే ఎత్తుగడేనన్నది తెలీంది కాదు. ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఉగ్రవాద హింస రోజురోజుకూ పెరుగుతుండగా, బలూచిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు తీవ్రమవుతున్నాయి. ఈ అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి భారత్‌ను బూచిగా చూపడం షెహబాజ్‌కు అలవాటైన రాజకీయ ఎత్తుగడ. పహల్గాం దాడి అనంతరం భారత్ ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా సింధూ ఒప్పందాన్ని నిలిపివేసిందని షెహబాజ్ ఆరోపించగా, ఉగ్రవాదానికి పాకిస్తాన్ మద్దతు ఇవ్వడం మానేసేవరకూ ఒప్పందం అలాగే కొనసాగుతుందని ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పి.హరీశ్ ఇప్పటికే స్పష్టం చేశారు. తామేమీ మిలిటరీ

## ..తగిన సమాధానం!

పరిష్కారాన్ని కోరుకోవడం లేదని, చర్చల ద్వారానే శాంతి సాధ్యమని ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ వంటివారు అంతర్జాతీయ వేదికలపై అంటుంటే, షెహబాజ్ మాత్రం పదేపదే బెదిరింపు భాషనే ఎంచుకోవడం, పాకిస్తాన్ నాయకత్వం వాస్తవికతకు ఎంత దూరంగా ఉందో తేటతెల్లం చేస్తోంది.

ఆపరేషన్ సిందూర్ తరువాత భారత్ వ్యూహం స్పష్టం, స్థిరం. ఆపరేషన్ జరిగిన వెంటనే అమెరికా, జపాన్, బ్రిటన్, సౌదీ అరేబియా, యూఏఈ, రష్యా, చైనా సహా పలు దేశాల భద్రతా సలహాదారులతో దోవల్ స్వయంగా మాట్లాడి, భారత చర్య 'కొలమానంతో కూడిన, తీవ్రతరం చేయని' విధానంలోనే సాగిందని స్పష్టం చేయడం ముందుచూపు. ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశం తమకు లేదని, అయితే పాక్ తీవ్రతరం చేసే యత్నం చేస్తే, గట్టిగా, నిర్ణయాత్మకంగా బదులివ్వడానికి సిద్ధంగా ఉన్నామని కూడా స్పష్టం చేశారు. ఈ ద్వంద్వ సందేశం – నిగ్రహం ప్రదర్శిస్తూనే, అవసరమైతే నిర్ణయాత్మకంగా వ్యవహరించే సంసిద్ధత –భారత్ కొత్త వ్యూహాత్మక వైఖరికి ప్రతీక. సైనిక చర్యల్లో మాత్రమే కాదు, దౌత్యపరంగానూ భారత్ ఈ సమతుల్యతను కొనసాగిస్తోంది. ఒకవైపు ఉగ్రవాదంపై ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేస్తూనే, మరోవైపు అంతర్జాతీయ సమాజంతో సంబంధాలను చెడగొట్టుకోకుండా, తన చర్యల వెనుక ఉన్న న్యాయబద్ధతను ప్రపంచానికి వివరించే ప్రయత్నం చేస్తోంది. ఇప్పుడు దోవల్ డాక్యుసిరీస్ ద్వారా బహిరంగంగా మాట్లాడటం కూడా అదే వ్యూహంలో భాగం. దేశ ప్రజలకు, ప్రపంచానికి భారత సైనిక, భద్రతా నాయకత్వం వెనుక ఉన్న ఆలోచనా విధానాన్ని, నిర్ణయాత్మక సంకల్పాన్ని స్పష్టం చేయడం. ఇది కేవలం గత చర్యలను గుర్తుచేసుకోవడం మాత్రమే కాదు, భవిష్యత్తులో ఇలాంటి ముప్పులు ఎదురైతే భారత్ ఎలా స్పందిస్తుందో స్పష్టమైన సంకేతం ఇవ్వడం కూడా.

ఈ మొత్తం పరిణామాల నుంచి స్పష్టమయ్యేదేమిటంటే, భారత్ ఇప్పుడు క్రియాశీల నిరోధక వైఖరిని బలంగా అనుసరిస్తోంది. నిగ్రహం బలహీనత కాదని, వ్యూహాత్మక ఎంపిక మాత్రమేనని ప్రపంచానికి చాటుతోంది. సరిహద్దు ఆవలి నుంచి వచ్చే ముప్పులకు గట్టిగా, నిర్ణయాత్మకంగా స్పందించే సామర్థ్యం, సంసిద్ధత రెండూ తనకున్నాయని పదేపదే నిరూపించుకుంటోంది. మరోవైపు, పాక్ నాయకత్వం మాత్రం వాస్తవాలను వక్రీకరిస్తూ.. తమ సైనిక వైఫల్యాలను దాచిపెట్టుకోవడానికి బోలు బెదిరింపులు, అబద్ధపు విజయ గాథలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో, భారత్ అనుసరిస్తున్న సంయమనం, స్పష్టత కలగలిసిన వ్యూహం చాలా ముఖ్యమైనది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జీరో టాలరెన్స్ విధానాన్ని కొనసాగిస్తూనే, అంతర్జాతీయ సమాజంతో బాధ్యతాయుతమైన శక్తిగా తన ప్రతిష్టను కాపాడుకోవడం, రెండు లక్ష్యాలనూ భారత్ సమర్థంగా సాధిస్తోంది. దోవల్ చెప్పినట్టు, భారత్ సహనం బలహీనతకు చిహ్నం కాదు.. అది శక్తిపై ఉన్న విశ్వాసానికి, బాధ్యతాయుతమైన నాయకత్వానికి నిదర్శనం. ఇలాంటి స్పష్టమైన సందేశం, భవిష్యత్తులో సరిహద్దు ఆవలి నుంచి వచ్చే ఏ ముప్పునైనా ఎదుర్కోవడానికి భారత్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ప్రపంచానికి, ముఖ్యంగా పొరుగుదేశానికి గట్టి హెచ్చరికగా నిలుస్తుంది!!

### పనికొచ్చే పలుకు



## ప్రశ్నించడం.. ప్రాథమిక హక్కు!

"సైలెన్స్ ఈజ్ గోల్డెన్" అని ఎవరో చెప్పారు కదా –కానీ అన్యాయం జరుగుతున్నప్పుడు మౌనం మాత్రం గోల్డెన్ కాదు, కేవలం కంఫర్టబుల్ కావర్డీస్! ఈ విషయాన్ని అమెరికన్ సివిల్ రైట్స్ లీడర్ మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ ఏనాడో చెప్పాడు.. Our lives begin to end the day we become silent about things that matter. అంటే –మనకు నిజంగా మ్యాటర్ చేసే విషయాల్లో మనం సైలెంట్ అయిపోయిన రోజే, మన లైఫ్ ముగిసిపోవడం మొదలవుతుంది. హెవీ లైన్ కదా? కానీ ఇది వందశాతం రియల్.


ఇప్పుడు మనం బతుకుతున్న సోషల్ మీడియా వరల్డ్‌లో, "నాకెందుకులే గొడవ" అనే మెంటాలిటీ డెవలప్ అవుతోంది. ఇన్‌స్టాలో ఒక పోస్ట్ చూసి "సాడ్" రియాక్ట్ ఇచ్చి వదిలేయడం, గ్రూప్‌లో ఎవరో బుల్లీ చేస్తుంటే చూస్తూ ఊరుకోవడం, ఏదైనా అన్యాయం జరిగినప్పుడు "ఇది నా ప్రాబ్లమ్ కాదులే" అని స్క్రోల్ చేసుకుంటూ వెళ్లిపోవడం –ఇవన్నీ కూడా ఒక రకమైన సైలెన్స్. కానీ కింగ్ చెప్పిన పాయింట్ ఏంటంటే, ఈ సైలెన్స్ మనకు తెలియకుండానే మనల్ని కూడా ఆ అన్యాయంలో భాగస్వాములను చేస్తుందని. మీరు యాక్టివ్‌గా తప్పు చేయకపోయినా, చూస్తూ ఊరుకోవడం ద్వారా ఆ తప్పుకు సైలెంట్ సపోర్టర్‌గా మారిపోతారు.

మన కళ్ల ముందే దీనికి ఎగ్జాంపుల్ కూడా ఉంది. ఇటీవలే ఢిల్లీ జంతర్‌మంతర్‌లో జరిగిన ఆందోళన గుర్తుందా? నిరుద్యోగ యువతను కించపరుస్తూ ఒక వ్యాఖ్య వచ్చినప్పుడు, జెన్–జీ మౌనంగా లేదు. వీధుల్లోకి వచ్చింది. గొంతు వినిపించింది. లక్షలాది యువత లాఠీలు, బాష్పవాయువుకు భయపడకుండా నిలబడ్డారు. ఫలితం? ఒక కేంద్ర మంత్రినే రాజీనామా చేయించగలిగారు! ఇదే చెప్పేది –ఒక్క గొంతు ధైర్యంగా లేస్తే, అది వేలాది గొంతులకు స్ఫూర్తినిస్తుంది, అది సిస్టమ్‌నే కదిలించగలుగుతుంది. సైలెన్స్ మీ కంఫర్ట్ జోన్‌ను కాపాడుతుందేమో గానీ, అది ఎప్పుడూ మార్పును తీసుకురాదు.

ఇప్పుడు మీరు అనుకోవచ్చు –"నేను మార్టిన్ లూథర్ కింగ్ లాంటి బిగ్ లీడర్ కాదు కదా, నేనేం చేయగలను?" అని. కానీ మార్పు ఎప్పుడూ ఒక్క పెద్ద మూమెంట్‌తో మొదలవదు. చిన్న చిన్న యాక్ట్స్ ఆఫ్ కరేజ్‌తోనే మొదలవుతుంది. మీ ఫ్రెండ్ గ్రూప్‌లో ఎవరైనా రేసిస్ట్ జోక్ వేస్తే, "బ్రో అది కరెక్ట్ కాదు" అని చెప్పడం, కాలేజీలో ఎవరైనా బుల్లీ అవుతుంటే వాళ్లకు సపోర్ట్‌గా నిలబడటం, ఆఫీసులో అన్‌ఫెయిర్‌గా ఎవరినైనా ట్రీట్ చేస్తుంటే వాయిస్ రైజ్ చేయడం –ఇవన్నీ చిన్న చిన్న "ఐ హావ్ ఎ డ్రీమ్" మూమెంట్స్. కింగ్ కూడా మొదట్లో ఒక సాధారణ పాస్టర్ మాత్రమే, కానీ అన్యాయాన్ని చూసి మౌనంగా ఉండలేకపోయాడు, అదే ఆయనను చరిత్రలో నిలబెట్టింది.

సో, ఏదైనా తప్పు జరుగుతున్నప్పుడు "నాకెందుకు" అని సైలెంట్ కాకండి. మీ వాయిస్‌కి పవర్ ఉంది, అది మీకు తెలియకపోవచ్చు కానీ ఖచ్చితంగా ఉంది. అన్యాయం ముందు సైలెంట్‌గా ఉండటం అంటే, మీ నిజమైన సెల్ఫ్‌ను చంపుకోవడమే. బోల్డ్‌గా ఉండండి, వోకల్‌గా ఉండండి, ఎందుకంటే –సైలెన్స్ నెవర్ చేంజ్ ఎనీథింగ్, బట్ వాయిస్‌లు ఖచ్చితంగా చేంజ్ తీసుకొస్తాయి.

# ఆంధ్రప్రదేశ్.. రేపటి రూపు!




ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక చిత్రపటంలో ఇప్పుడు కొత్త అధ్యాయం మొదలవుతోంది. సంప్రదాయ తయారీ, ఐటీ రంగాలకు మించి, ఏరోస్పేస్, గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్‌వంటి భవిష్యత్ సాంకేతికతల్లో రాష్ట్రం అడుగు పెడుతుండటం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతకు నిదర్శనం. ఆగస్టు 12న జరిగిన సిపిబి సమావేశంలో గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్, కృత్రిమ మేధ, డేటా సెంటర్ల వంటి ఉద్భవిస్తున్న రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించాలని, ఈ భవిష్యత్ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించేందుకు అవసరమైన విధాన చర్యలను అధ్యయనం చేయాలని అధికారులను నాయుడు ఆదేశించడం విశేషం. ఇది కేవలం మాటలకే పరిమితం కాలేదు. ఇప్పటికే నెల్లూరు జిల్లా (శ్రీ సత్యసాయి జిల్లా)లో రేమండ్ గ్రూప్ అనుబంధ సంస్థ జేకే మైనీ గ్లోబల్ ఏరోస్పేస్ లిమిటెడ్, రూ.510 కోట్లతో అత్యాధునిక ఏరోస్పేస్ తయారీ యూనిట్‌ను నెలకొల్పుతోంది. గ్లోబల్ ఓఈఎం సంస్థలకు, టైర్–1 సరఫరాదారులకు అవసరమైన అత్యంత కచ్చితత్వం గల విమాన ఇంజిన్ విడిభాగాలను ఇక్కడ తయారు చేయనున్నారు. 2027 మే నాటికి వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కానుంది. 1,400 మందికిపైగా ప్రత్యక్ష ఉద్యోగాలు లభించనున్నాయి. అదే గ్రూప్‌నకు చెందిన మరో అనుబంధ సంస్థ గుడిపల్లిలో రూ.430 కోట్లతో ఆటోమోటివ్ విడిభాగాల యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఆపరేషన్ సిందూర్ విజయం తర్వాత ఏరోస్పేస్ రంగంలో వచ్చిన తొలి భారీ పెట్టుబడి ఇదే కావడం, బెంగళూరు సరిహద్దుకు ఆనుకుని ఉన్న హిందూపురం ప్రాంతాన్ని ఏరోస్పేస్ కారిడార్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి బలం చేకూరుస్తోంది. కొత్త ఏరోస్పేస్ పాలసీ కింద వచ్చిన తొలి పెట్టుబడి, భవిష్యత్తులో అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించే అవకాశాలకు తలుపులు తెరుస్తోంది.

గ్రీన్ అమ్మోనియా రంగంలో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే ప్రపంచస్థాయి గుర్తింపు సాధించింది. కాకినాడలో ఏఎం గ్రీన్ సంస్థ చేపడుతున్న 1.5 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం గల గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్దదిగా నిలవనుంది. మొత్తం రూ.84,000 కోట్ల పెట్టుబడితో, పాత నాగార్జున ఫెర్టిలైజర్స్ కాంప్లెక్స్‌ను పునరుద్ధరిస్తూ దీన్ని నిర్మిస్తున్నారు. 7.5 గిగావాట్ల సౌర, పవన విద్యుత్ సామర్థ్యం, 1,950 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్ సామర్థ్యం, 2 గిగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజీతో సమీకృత క్లీన్ ఎనర్జీ వ్యవస్థగా దీన్ని రూపొందిస్తున్నారు. 2027నాటికి తొలి దశ, 2030 నాటికి పూర్తి సామర్థ్యం అందుబాటులోకి రానుండగా, ఇక్కడ ఉత్పత్తయ్యే గ్రీన్ అమ్మోనియా ప్రధానంగా జర్మనీకి ఎగుమతి కానుంది. ఇది ప్రపంచ క్లీన్ ఎనర్జీ సరఫరా వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ పాత్రను మరింత బలోపేతం చేస్తుంది. ఇంతకుముందు రిన్యూ ఎనర్జీ సంస్థ రూ.82,000 కోట్ల పెట్టుబడితో 6 గిగావాట్ల పీవీ ఇంగాట్–వేఫర్ ప్లాంటు, 300 కేటీపీఏ గ్రీన్ అమ్మోనియా యూనిట్‌ను కూడా ప్రకటించడం గమనార్హం. లిథియం బ్యాటరీల రంగంలోనూ రాష్ట్రం ముందంజలో ఉంది. వారీ ఎనర్జీస్ సంస్థ అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.8,175 కోట్లతో దేశంలోనే అతిపెద్ద లిథియం–అయాన్ బ్యాటరీ గిగాఫ్యాక్టరీని నెలకొల్పనుంది. వార్షిక 16 గిగావాట్–గంటల సామర్థ్యంతో, సెల్ తయారీ నుంచి బ్యాటరీ ప్యాక్ అసెంబ్లీ వరకూ మొత్తం విలువ శృంఖలాన్ని ఇది కవర్ చేస్తుంది. 3,000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. దీంతోపాటు, అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీని ప్రవేశపెట్టి, ఐబీఎం, డీఆర్‌డీవో, బార్క్ వంటి సంస్థలతో కలిసి క్వాంటమ్ హార్డ్‌వేర్ తయారీ వ్యవస్థను నిర్మించే దిశగా అడుగులు వేస్తుండటం, ఏకకాలంలో అనేక భవిష్యత్ సాంకేతికతలపై రాష్ట్రం ఎంత విస్తృతంగా దృష్టి సారించిందో స్పష్టం చేస్తోంది.

అయితే, ఇంతటి ప్రతిష్టాత్మక లక్ష్యాలను సాధించే మార్గంలో సవాళ్లు కూడా తక్కువేమీ కాదు. ఏరోస్పేస్, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి రంగాలకు అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం. ఈ నైపుణ్య అంతరాన్ని పూడ్చడం, స్థానిక యువతకు తగిన శిక్షణ ఇవ్వడం పెద్ద సవాలే. లిథియం బ్యాటరీ, గ్రీన్ అమ్మోనియా వంటి పరిశ్రమలకు భారీ మొత్తంలో నీరు, విద్యుత్ అవసరం కావడం, పర్యావరణపరమైన సమతుల్యతను కాపాడుకుంటూనే వీటిని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కూడా ఉంది. అంతేకాక, ఇలాంటి అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలకు అవసరమైన ప్రత్యేక మౌలిక సదుపాయాలు –స్థిరమైన విద్యుత్ సరఫరా, ప్రత్యేక పారిశ్రామిక పార్కులు, పరిశోధన–అభివృద్ధి కేంద్రాలు.. ఇవన్నీ వేగంగా సిద్ధం చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు నాయుడు ప్రభుత్వం అనుసరిస్తున్న వేగం, స్పష్టమైన ప్రణాళిక అభినందనీయం. ప్రతి కొత్త రంగానికి ప్రత్యేక పాలసీని రూపొందించడం.. ఏరోస్పేస్ పాలసీ, క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ, ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ, ఐటీ అండ్ జీసీసీ పాలసీ 4.0 –ఇలా ప్రతి రంగానికి ప్రత్యేకంగా విధానపరమైన స్పష్టత ఇవ్వడం ద్వారా పెట్టుబడిదారులకు నమ్మకాన్ని కల్పిస్తున్నారు. విద్యుత్ మిగులు రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దిన సంస్కరణలు, గూగుల్ వంటి దిగ్గజ సంస్థలను ఆకర్షించడానికి పునాదిగా మారడం కూడా ఇందుకు నిదర్శనం. ప్రతి సవాలుకూ ముందుగానే పరిష్కారం ఆలోచించి, వేగంగా అమలు చేసే నాయుడు పరిపాలనా శైలి, ఈ భవిష్యత్ రంగాల్లో రాష్ట్రం విజయవంతం కావడానికి కీలక పాత్ర పోషిస్తోంది.

మొత్తంమీద చూస్తే, ఏరోస్పేస్, గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి రంగాల్లో ఏకకాలంలో పెట్టుబడులను ఆకర్షించగలగడం, ఆంధ్రప్రదేశ్‌ను కేవలం ఒక తయారీ కేంద్రంగా కాకుండా, భవిష్యత్ సాంకేతిక శక్తిగా తీర్చిదిద్దాలన్న నాయుడు దార్శనికతకు నిదర్శనం. సంప్రదాయ పరిశ్రమల మీదే ఆధారపడకుండా, రేపటి ప్రపంచానికి అవసరమైన సాంకేతికతలపై ఇప్పుడే పెట్టుబడి పెట్టడం అనేది దీర్ఘకాలిక ఆలోచనకు నిదర్శనం. ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు, దేశంలోనే అతిపెద్ద లిథియం బ్యాటరీ గిగాఫ్యాక్టరీ, ఆపరేషన్ సిందూర్ అనంతరం తొలి ఏరోస్పేస్ పెట్టుబడి –ఇవన్నీ ఏపీ ఖాతాలో చేరడం యాదృచ్ఛికం కాదు, ఇది స్పష్టమైన వ్యూహం, వేగవంతమైన అమలు ఫలితమే! సవాళ్లు ఎదురైనప్పుడు వెనుకడుగు వేయకుండా, ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీతో, స్పష్టమైన కాలవ్యవధితో ముందుకు సాగుతున్న నాయుడు నాయకత్వం, రాష్ట్రాన్ని నిజంగానే భవిష్యత్ సాంకేతిక కేంద్రంగా మార్చగలదన్న విశ్వాసాన్ని కలిగిస్తోంది. 2047నాటికి స్వర్ణాంధ్రగా ఎదగాలన్న లక్ష్యానికి, ఈ కొత్తతరం పరిశ్రమలు బలమైన పునాదిగా నిలవనున్నాయి. రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి ఉద్యోగావకాశాలు, ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ గుర్తింపు రెండూ ఈ దార్శనిక వ్యూహం ద్వారా సాకారం కానున్నాయి. ■




ఇతరుల మాటలు, అభిప్రాయాల ప్రకారం పిల్లలను తీర్చిదిద్దాలని చూస్తే, వారు పైకి పద్ధతిగా కనిపించొచ్చు. కానీ లోలోపల స్వేచ్ఛ లేమి వారిని మీ నుంచి దూరం చేస్తుంది. ప్రతి బంధువు సలహా, ప్రతి టీచర్ కామెంట్‌కు అనుగుణంగా పెంపకాన్ని మార్చుకుంటే, పిల్లల నిజమైన వ్యక్తిత్వం వికసించే అవకాశం కోల్పోతారు. మీ పిల్లల్ని మీరే బాగా అర్థం చేసుకోగలరు. కాబట్టి, ఇతరుల అభిప్రాయాలను వినండి, కానీ నిర్ణయాలు మాత్రం మీ సొంత అవగాహన, మీ పిల్లల అవసరాల ఆధారంగానే తీసుకోండి. మీ విధానాన్నే పిల్లలూ అలవాటు చేసుకుని తరాలనే మార్చగలుగుతారు.

–మహాదేవ

### వింతల్లో వింతలు

## మూడేళ్ల మాయా పిల్లి!



న్యూజిలాండ్‌లోని ప్యూరురువా ద్వీపకల్పంలో అంతరించిపోతున్న 'పటేకె' (బ్రౌన్ టీల్) బాతులను రక్షించే ప్రాజెక్టుకు ఒక పిల్లి పీడకలగా మారింది. మూడేళ్ల క్రితం 20 అరుదైన బాతులను అడవిలోకి వదిలిన వారంలోనే ఒకటి చనిపోవడంతో, ఒక బూడిదరంగు పిల్లే కారణమని శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే, దాన్ని పట్టుకోవడం మాత్రం అసాధ్యంగా మారింది. అనూహ్యంగా ప్రవర్తిస్తూ, ఎప్పుడు ఎక్కడ కనిపిస్తుందో ఊహించలేని తీరుతో అది పరిశోధకులనుముప్పుతిప్పలు పెట్టింది. దీంతో దానికి 'నైన్ లైవ్స్' అని పేరుపెట్టారు. 2024లో మరో 20 బాతులను వదిలితే, వాటిలో 15టిని ఇదే వేటాడేసింది. మొత్తంగా మూడేళ్లలో డజన్ల కొద్దీ బాతులతోపాటు, కివీ పిల్లలు, స్థానిక బల్లులను కూడా చంపేసిందట. చివరికి వరుసగా మూడు రాత్రులు ఒకే ప్రదేశంలో కనిపించడంతో, సాల్మన్, ఫ్రైడ్ చికెన్, కుందేలు మాంసంతో ఎర వేసి బోనులో బంధించారు. అయితే, పట్టుకున్న

## బాదంపప్పు, వాల్‌నట్స్ వంటి గింజలను ఎక్కువ కాలం పాటు ఇలా నిల్వ చేయండి..



గింజలు (నట్స్) ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఆహారాల్లో ఒకటి. బాదం, పిస్తా, అక్రోట్స్ వంటి నట్స్‌లో విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు సమృద్ధిగా ఉంటాయి. అయితే వీటి పూర్తి ప్రయోజనాలను పొందాలంటే సరైన పరిమాణంలో తీసుకోవడంతో పాటు వాటిని సరిగ్గా నిల్వ చేయడం కూడా చాలా ముఖ్యం. తేమ, వేడి, గాలి ప్రభావానికి గురైతే నట్స్ త్వరగా పాడైపోయే అవకాశం ఉంటుంది. తయారీ తేదీ, నిల్వ చేసే ఉష్ణోగ్రత వంటి అంశాలు కూడా వాటి నిల్వ కాలాన్ని ప్రభావితం చేస్తాయి. కొన్ని సులభమైన జాగ్రత్తలు పాటిస్తే నట్స్‌ను ఎక్కువకాలం తాజాగా ఉంచుకోవచ్చు. ముందుగా నట్స్‌ను తాజాగా కొనుగోలు చేయడం మంచిది. ఒకేసారి ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయడం కంటే కొన్ని వారాల్లో వినియోగించగలిగేంత పరిమాణంలో కొనడం ఉత్తమం. ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసిన నట్స్‌ను సరిగా నిల్వ చేయకపోతే వేడి కారణంగా త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది. కొనుగోలు చేసే ముందు వీలైతే వాటి తాజాదనాన్ని రుచి చూసి నిర్ధారించుకోవడం మంచిది.

### తేమ వెళ్లకుండా..

నట్స్‌ను గాలి చొరబడని డబ్బాల్లో నిల్వ చేయడం ఉత్తమ మార్గం. గాలి లోపలికి వెళ్లకుండా ఉండటం వల్ల అవి ఎక్కువకాలం తాజాగా ఉంటాయి. ముఖ్యంగా బాదం, అక్రోట్స్ వంటి నట్స్ బయట వాసనలను సులభంగా పీల్చుకునే స్వభావం కలిగి ఉంటాయి. గాలి చొరబడని కంటైనర్లు ఈ సమస్యను నివారించడంలో సహాయపడతాయి. నట్స్‌ను ఎప్పుడూ చల్లని, పొడి ప్రదేశంలో ఉంచాలి. స్టవ్ పైన ఉన్న కిచెన్ క్యాబినెట్‌లలో లేదా అధిక వేడి ఉండే ప్రదేశాల్లో నిల్వ చేయడం మంచిది కాదు. అధిక ఉష్ణోగ్రతలకు గురైతే నట్స్ త్వరగా పాడై రుచి మారిపోతుంది. అలాగే నిల్వ చేసే ముందు అవి పూర్తిగా పొడిగా ఉన్నాయో లేదో కూడా నిర్ధారించుకోవాలి.

### రుచి తగ్గినట్లు అనిపిస్తే..

నట్స్ కొద్దిగా పాతబడి రుచి తగ్గినట్లు అనిపిస్తే, వాటిని ఓవెన్‌లో కొన్ని నిమిషాలు స్వల్పంగా వేడి చేయవచ్చు. ఇలా చేయడం వల్ల వాటి సహజ రుచి కొంతవరకు తిరిగి వచ్చే అవకాశం ఉంటుంది. అయితే నట్స్‌లోని సహజ నూనెలు పూర్తిగా చెడిపోయి ఉంటే ఈ పద్ధతి ఉపయోగపడదు. ఈ చిన్నచిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా నట్స్‌ను ఎక్కువకాలం తాజాగా ఉంచుకోవడంతోపాటు వాటి రుచి, నాణ్యతను కూడా కాపాడుకోవచ్చు.

## మధుమేహం ఉన్నవారికి వరం విటమిన్ డి.. సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడి..



విటమిన్ డి శరీరానికి అత్యంత అవసరమైన పోషకాలలో ఒకటి. దీనిని సన్‌షైన్ విటమిన్ అని కూడా పిలుస్తారు. ఎముకల ఆరోగ్యంతోపాటు శరీరంలోని అనేక కీలక వ్యవస్థలు సక్రమంగా పనిచేయడానికి ఇది అవసరం. ఒక అధ్యయనం ప్రకారం విటమిన్ డి క్లోమగ్రంథి (ప్యాంక్రియాస్)లో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసి, నిల్వ చేసి, విడుదల చేసే బీటా కణాల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడే అవకాశం ఉందని పరిశోధకులు గుర్తించారు. దీంతో మధుమేహం చికిత్సలో విటమిన్ డి పాత్రపై కొత్త ఆశలు కనిపిస్తున్నాయి. పరిశోధకుల ప్రకారం శరీరంలో విటమిన్ డి స్థాయిలు ఎక్కువగా ఉండటం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. విటమిన్ డి రిసెప్టర్‌ను చురుకుగా చేయడం ద్వారా శరీరంలోని వాపులను తగ్గించే జన్యువుల పనితీరు మెరుగుపడి, ఒత్తిడిలో కూడా బీటా కణాలు మనుగడ సాగించేందుకు తోడ్పడతాయని అధ్యయనం పేర్కొంది. అయితే కేవలం విటమిన్ డి ఒక్కటే బీటా కణాలను పూర్తిగా రక్షించలేదని కూడా పరిశోధకులు వెల్లడించారు.

### సూర్యకాంతి తగలాలి..

శరీరంలో విటమిన్ డి లోపం రాకుండా ఉండాలంటే ప్రతిరోజూ కొంతసేపు సూర్యరశ్మిలో గడపడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. రోజుకు కనీసం ఐదు నిమిషాలపాటు ఎండలో ఉండటం వల్ల చర్మంలో ఉండే కొలెస్ట్రాల్‌పై సూర్యుని అతినీలలోహిత కిరణాలు ప్రభావం చూపి విటమిన్ డిగా మారుతుంది. అలాగే వారానికి కనీసం మూడు రోజులైనా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య సూర్యరశ్మి శరీరానికి అందితే విటమిన్ డి స్థాయిలు పెరగడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఆహారంలో విటమిన్ డి సమృద్ధిగా ఉండే పదార్థాలను చేర్చుకోవడం కూడా అవసరం. ముఖ్యంగా పుట్టగొడుగులు, గుడ్డు పచ్చసొన, కాడ్ లివర్ ఆయిల్, కొవ్వు ఎక్కువగా ఉండే చేపలు వంటి ఆహారాల్లో విటమిన్ డి లభిస్తుంది.

### ఈ ఆహారాలను తీసుకుంటే..


సోయా పాలు, మజ్జిగ వంటి పానీయాలను రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం కూడా విటమిన్ డి అందించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. అయితే ఇతర విటమిన్ డి ఫోర్టిఫైడ్ పానీయాలను తీసుకునే ముందు పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. విటమిన్ డి లోపం ఉన్నట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయినప్పుడు మాత్రమే వైద్యుల పర్యవేక్షణలో విటమిన్ డి సప్లిమెంట్లను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. స్వయంగా మందులు వాడటం ఆరోగ్యానికి హానికరమవుతుందని హెచ్చరిస్తున్నారు. విటమిన్ డి ఎక్కువగా కాడ్ లివర్ ఫిష్ ఆయిల్, ఎండబెట్టిన షిటాకే పుట్టగొడుగులు, గుడ్లు, పూర్తి పాలతో తయారుచేసిన మజ్జిగ, చెడార్ లేదా పార్మెసన్ చీజ్ వంటి ఆహారాల్లో లభిస్తుంది. వీటిని తీసుకోవడం ద్వారా మనం తగినంత విటమిన్ డి ని పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## వయస్సు పెరుగుతున్న కొద్దీ చర్మంపై కనిపించే ముడతలను ఇలా తగ్గించుకోండి

వయసు పెరుగుతున్న కొద్దీ చర్మంపై ముడతలు కనిపించడం సహజం. అయితే కేవలం వయసే కాదు, చర్మంలో తేమ తగ్గడం, స్థితిస్థాపకత (ఎలాస్టిసిటీ) కోల్పోవడం, అధిక సూర్యరశ్మి, కాలుష్యం, ధూమపానం, అలాగే పోషకాహార లోపాలు కూడా ముడతలు త్వరగా రావడానికి కారణమవుతాయి. చాలా మంది వీటిని తగ్గించేందుకు ఖరీదైన యాంటీ ఏజింగ్ క్రీములను ఉపయోగిస్తుంటారు. అయితే ఇంట్లోనే లభించే కొన్ని సహజ పదార్థాలతో కూడా చర్మ సంరక్షణ చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అదే సమయంలో సమతుల్యమైన ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం కూడా ఎంతో ముఖ్యమని చెబుతున్నారు. మొట్టమొదటగా గుడ్డు తెల్లసొనను ఉపయోగించవచ్చు. ఒక గిన్నెలో గుడ్డు తెల్లసొనను బాగా గిలక్కొట్టి నేరుగా ముఖంపై రాసి, మృదువుగా మసాజ్ చేయాలి. సుమారు 15 నిమిషాలు లేదా పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇందులో ఉండే ప్రోటీన్, విటమిన్ బి, విటమిన్ ఇ చర్మాన్ని పోషించి ముడతలను తగ్గించడంలో సహాయపడతాయి.

### ఆలివ్ ఆయిల్, నిమ్మరసం..

అలివ్ ఆయిల్ కూడా చర్మానికి మంచి సహజ మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. రాత్రి నిద్రపోయే ముందు కొన్ని చుక్కల ఆలివ్ ఆయిల్‌ను ముఖంపై మృదువుగా మసాజ్ చేసి, అదనంగా ఉన్న నూనెను మృదువైన వస్త్రంతో తుడవాలి. ఇలా చేయడం వల్ల ఉదయానికి చర్మం మరింత మృదువుగా, తేమతో కనిపించే అవకాశం ఉంటుంది. నిమ్మరసంలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. కొద్దిగా నిమ్మరసాన్ని ముడతలు ఉన్న ప్రాంతాల్లో రాసి సున్నితంగా మసాజ్ చేయవచ్చు. ఇది చర్మాన్ని కాంతివంతంగా కనిపించేలా చేయడంలో తోడ్పడుతుంది. అయితే నిమ్మరసం ఆమ్ల గుణాలు కలిగి ఉండటంతో ఎక్కువగా లేదా తరచూ ఉపయోగించకుండా జాగ్రత్త వహించాలి. అలోవెరా జెల్‌లో ఉండే మాలిక్ యాసిడ్ చర్మ స్థితిస్థాపకతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. తాజా



అలోవెరా ఆకులోని జెల్‌ను తీసి ముఖంపై రాసి 15 నిమిషాల తర్వాత కడిగేయాలి. లేదా విటమిన్ ఇ ఆయిల్‌తో కలిపి కూడా ఉపయోగించవచ్చు.

### అరటి పండు, క్యారెట్లు..

అరటిపండులోని పోషకాలు కూడా చర్మానికి మేలు చేస్తాయి. రెండు అరటిపండ్లను మెత్తగా మెదిపి పేస్ట్‌లా చేసి ముఖంపై రాసి సుమారు అరగంట తర్వాత కడిగేయాలి. కావాలంటే తేనె, అవకాడోతో కలిపి కూడా ఉపయోగించవచ్చు. క్యారెట్‌లో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడి చర్మాన్ని మృదువుగా ఉంచడంలో సహాయపడుతుంది. ఉడికించిన క్యారెట్‌ను తేనెతో కలిపి పేస్ట్ చేసి ముఖానికి పట్టించి అరగంట తర్వాత కడిగేయాలి. అలాగే క్యారెట్‌ను నేరుగా ఆహారంగా తీసుకోవడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. అనాసపండులో ఉండే ఎంజైములు చర్మానికి తేమను అందించడంతో పాటు చనిపోయిన కణాలను తొలగించడంలో సహాయపడతాయి. అనాసపండు ముక్కను నేరుగా ముఖంపై రుద్ది 20 నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేయాలి. చర్మ ఆరోగ్యానికి అత్యంత సులభమైన మార్గం తగినంత నీరు తాగడం. రోజుకు కనీసం రెండు లీటర్ల నీరు తాగడం వల్ల శరీరం, చర్మం తేమను నిల్వ చేసుకోవడానికి సహాయపడుతుంది. దీంతో చర్మం తాజాగా, ఆరోగ్యంగా కనిపించే అవకాశాలు మెరుగుపడతాయి.

## పులిపిర్లను తగ్గించే ఇంటి చిట్కాలు.. ఇలా చేస్తే సమస్య తగ్గుతుంది..

చర్మంపై కనిపించే చిన్న గుండ్రని లేదా అండాకార పెరుగుదలలను పులిపిర్లు (వార్ట్స్) అంటారు. ఇది వైరల్ ఇన్‌ఫెక్షన్ కారణంగా ఏర్పడే సాధారణ చర్మ సమస్య. సాధారణంగా నొప్పి ఉండకపోయినా, కొన్ని సందర్భాల్లో అసౌకర్యం లేదా నొప్పిని కలిగిస్తాయి. చేతులు, కాళ్లు, జననేంద్రియాలపై కూడా ఇవి కనిపించే అవకాశం ఉంటుంది. వైద్యులు అవసరాన్ని బట్టి శస్త్రచికిత్స లేదా క్రయోథెరపీ వంటి చికిత్సలను సూచిస్తారు. అయితే ప్రారంభ దశలో కొన్ని సహజ పదార్థాలను ఉపయోగించడం వల్ల కొంతమందికి ఉపశమనం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అలోవెరా (కలబంద) జెల్‌ను నేరుగా పులిపిర్లపై రాయడం వల్ల ప్రయోజనం కలుగుతుందని పేర్కొంటున్నారు. కలబందలో ఉండే మాలిక్ యాసిడ్ చర్మాన్ని పునరుద్ధరించడంలో, వార్ట్‌లను క్రమంగా తగ్గించడంలో సహాయపడుతుంది.

### బేకింగ్ పౌడర్, యాపిల్ సైడర్ వెనిగర్..

బేకింగ్ పౌడర్‌ను ఆముదం నూనెతో కలిపి పేస్ట్‌లా తయారు చేసి రాత్రి సమయంలో వార్ట్‌లపై రాసి, బ్యాండేజ్‌తో కప్పాలి. ఇలా ప్రతిరోజూ చేయడం వల్ల వార్ట్ లు క్రమంగా తగ్గే అవకాశం ఉంటుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌లో ఉండే అసిటిక్ యాసిడ్ వార్ట్ ల కణజాలాన్ని క్రమంగా దెబ్బతీయడంలో సహాయపడుతుంది. కాటన్‌ను వెనిగర్‌లో ముంచి వార్ట్‌లపై ఉంచి, అతికే బ్యాండేజ్‌తో రాత్రంతా అలాగే ఉంచాలి. అరటి తొక్కలో ఉండే ఎంజైమ్‌లు చర్మాన్ని పునరుత్తేజపరచడంలో సహాయపడతాయి. అలాగే ఇందులో యాంటీ మైక్రోబియల్ గుణాలు కూడా ఉంటాయి. ప్రతిరోజూ కొన్ని నిమిషాల పాటు అరటి తొక్క లోపలి భాగంతో వార్ట్‌లపై నెమ్మదిగా రుద్దడం వల్ల ప్రయోజనం కలుగుతుంది. వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ అనే పదార్థం శక్తివంతమైన యాంటీ మైక్రోబియల్ గుణాలను కలిగి ఉంటుంది. ఇది బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, వైరస్‌లపై ప్రభావం చూపుతుంది. కొన్ని వెల్లుల్లి రెబ్బలను దంచి వార్ట్‌లపై రాయడం వల్ల వైరల్ ఇన్‌ఫెక్షన్ తగ్గడంలో సహాయపడతాయి. వెల్లుల్లిని ఆహారంలో భాగంగా తీసుకోవడం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

### పసుపు, లవంగ నూనె..

పసుపును కొద్దిగా నీటితో కలిపి పేస్ట్‌లా చేసి వార్ట్‌లపై రాసి సుమారు అరగంట తర్వాత కడిగేయాలి. పసుపులో ఉండే యాంటీ మైక్రోబియల్ గుణాలు ఇన్‌ఫెక్షన్‌ను తగ్గించడంలో, వార్ట్‌లను తొలగించడంలో సహాయపడతాయి. పసుపు వల్ల చర్మంపై ఏర్పడే పసుపు రంగును నిమ్మకాయ ముక్కతో నెమ్మదిగా రుద్ది తొలగించవచ్చు. లవంగ నూనెను వార్ట్‌లపై రాసి బ్యాండ్ ఎయిడ్‌తో కప్పాలి. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల వార్ట్ లు తగ్గే అవకాశం ఉంటుంది. లవంగ నూనెలో ఉండే యూజెనిన్ అనే సమ్మేళనం యాంటీ వైరల్ గుణాలను కలిగి ఉండి వైరస్ వ్యాప్తిని నిరోధించడంలో సహాయపడుతుంది. అయితే వార్ట్స్ పరిమాణం పెరగడం, నొప్పి, రక్తస్రావం లేదా జననేంద్రియాలపై కనిపించడం వంటి పరిస్థితుల్లో ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకుండా చర్మవ్యాధి నిపుణులను సంప్రదించడం అవసరం.



# 600వ టెస్టు: సెంచరీతో మెరిసిన పడిక్కల్.. తొలి రోజు భారత్ జోరు

- లంకతో టెస్టులో పటిష్ఠ స్థితిలో భారత్
- ఓపెనర్ జైస్వాల్ త్వరగా ఔట్
- ఆదుకున్న రాహుల్, పడిక్కల్
- భారీ భాగస్వామ్యం నమోదు చేసిన ద్వయం
- భారీ స్కోరు దిశగా సాగుతున్న టీమిండియా



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక పర్యటనలో భాగంగా గాలె వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో భారత జట్టు తొలి రోజే పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (107 బ్యాటింగ్) అద్భుత శతకంతో కదం తొక్కగా, సీనియర్ ఆటగాడు కేఎల్ రాహుల్ (77) అర్ధశతకంతో రాణించాడు. వీరిద్దరి నిలకడైన ఆటతో, మూడో సెషన్ కొనసాగుతుండగా భారత్ 2 వికెట్ల నష్టానికి 239 పరుగులతో పటిష్ఠ స్థితిలో నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియాకు ఆరంభంలోనే చిన్న షాక్ తగిలింది. దూకుడుగా ఆడిన ఓపెనర్ యశస్వి జైస్వాల్ (32) దురదృష్టవశాత్తు రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన పడిక్కల్, మరో ఓపెనర్ కేఎల్ రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఈ జోడీ లంక బౌలర్లను ఓపికగా ఎదుర్కొంటూ రెండో వికెట్‌కు 150 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పింది. అయితే, 77 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కేఎల్ రాహుల్ గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడటం భారత్‌ను కాస్త నిరాశపరిచింది. రాహుల్ వెనుదిరిగినా పడిక్కల్ ఏమాత్రం ఒత్తిడికి గురికాలేదు. తన సహజ శైలిలో ఆడుతూ లంక బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాడు. మధ్యలో వర్షం కారణంగా ఆటకు కొద్దిసేపు అంతరాయం కలిగినా, అతని ఏకాగ్రతను దెబ్బతీయలేకపోయింది. అద్భుతమైన షాట్లతో అలరించిన పడిక్కల్, 147 బంతుల్లో 9 ఫోర్లు, ఒక సిక్సర్‌తో తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు.

ఇక, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (16) ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. శ్రీలంక స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. ప్రస్తుతం పడిక్కల్‌కు తోడుగా రిషభ్ పంత్ (3) క్రీజులో ఉన్నాడు. లంక బౌలర్లలో జయసూర్యకు ఒక వికెట్ దక్కింది. తొలి రోజు ఆటలో భారత్ పూర్తి ఆధిక్యం కనబరచడంతో, భారీ స్కోరు చేసే దిశగా పయనిస్తోంది.

# ఒక్క పోస్ట్.. భారత క్రికెట్‌లో ముగిసిన ఒక స్వర్ణయుగం.. ధోనీ వీడ్కోలుకు ఆరేళ్లు!

- ధోనీ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి ఆరేళ్లు పూర్తి
- 2020 ఆగస్ట్ 15న రాత్రి 7:29కి ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటన
- మూడు ఐసీసీ ట్రోఫీలు గెలిచిన ఏకైక కెప్టెన్‌గా చారిత్రక రికార్డు
- ఐపీఎల్‌లో చెన్నైకి 5 టైటిళ్లు అందించిన ఎంఎస్‌డీ
- ప్రపంచ క్రికెట్‌లో ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన ధోనీ వారసత్వం





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ చరిత్రలో అదొక మరపురాని రోజు. దేశమంతా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో మునిగి తేలుతున్న వేళ, ఒక శకం ముగిసింది. సరిగ్గా ఆరేళ్ల క్రితం 2020 ఆగస్ట్ 15న రాత్రి 7:29 గంటలకు.. భారత క్రికెట్‌ను శాసించిన, అత్యంత ప్రభావవంతమైన ఆటగాళ్లలో ఒకడైన మహేంద్ర సింగ్ ధోనీ తన 15 ఏళ్ల అద్భుతమైన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఎలాంటి మీడియా సమావేశం లేదు, సుదీర్ఘ ప్రసంగాలు లేవు, ఆర్భాటాలు అసలే లేవు. తనకు మాత్రమే సాధ్యమైన రీతిలో అత్యంత నిశ్శబ్దంగా ధోనీ ఈ సంచలన నిర్ణయాన్ని ప్రకటించాడు.

తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో, తన క్రికెట్ ప్రయాణంలోని మధురమైన చిత్రాలతో కూడిన ఒక వీడియోను పంచుకున్నాడు. ఆ వీడియో నేపథ్యంలోని 'మై పల్ దో పల్ కా షాయర్ హూన్' అనే ముకేశ్ పాట, అతని వీడ్కోలు భావనకు అద్దం పట్టింది. "ఇన్నాళ్లు మీరు చూపిన ప్రేమ, మద్దతుకు ధన్యవాదాలు. ఈ రోజు రాత్రి 7:29 గంటల నుంచి నన్ను రిటైర్ అయిన వ్యక్తిగా పరిగణించండి" అని క్లుప్తంగా రాసుకొచ్చాడు. అంతే.. ఒక్క పోస్ట్‌తో భారత క్రికెట్‌లో ఒక స్వర్ణయుగం ముగిసిపోయింది. నాయకత్వానికి కొత్త అర్థం చెప్పిన, ఒత్తిడిలో మ్యాచ్‌లను ముగించడంలో తనకు తానే సాటి అని నిరూపించుకున్న ఒక గొప్ప యోధుడు మైదానం నుంచి అలా నిష్క్రమించాడు. 2004లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన ధోనీ, ఆ తర్వాత చరిత్ర సృష్టించాడు. మూడు ప్రధాన ఐసీసీ ట్రోఫీలు (టీ20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ) గెలిచిన ప్రపంచంలోని ఏకైక కెప్టెన్‌గా రికార్డు సృష్టించాడు. 2007లో తొలి టీ20 ప్రపంచకప్‌ను యువ జట్టుతో గెలిచి సంచలనం సృష్టించాడు. ఆ తర్వాత 2011లో వాంఖడే స్టేడియంలో సిక్సర్‌తో వన్డే ప్రపంచకప్‌ను అందించి భారతీయుల 28 ఏళ్ల నిరీక్షణకు తెరదించాడు. 2013లో ఛాంపియన్స్ ట్రోఫీ గెలుపుతో అతని కెప్టెన్సీ ప్రస్థానం పరిపూర్ణమైంది. ఆటగాడిగానూ ధోనీ గణాంకాలు అద్భుతం. 350 వన్డేల్లో 10,773 పరుగులు, 90 టెస్టుల్లో 4,876 పరుగులు చేశాడు. 98 టీ20 మ్యాచ్‌లలోనూ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. వికెట్ల వెనుక అతడి చురుకుదనానికి 829 అంతర్జాతీయ డిస్మిసల్స్ నిదర్శనం. ప్రపంచంలోని గొప్ప వికెట్ కీపర్-బ్యాటర్లలో ఒకరిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. 2019 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్‌లో న్యూజిలాండ్‌పై ఆడిన మ్యాచే మహీ చివరి అంతర్జాతీయ మ్యాచ్.

అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా, క్రికెట్‌కు మాత్రం దూరం కాలేదు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుకు నాయకుడిగా కొనసాగుతూ, ఆ జట్టుకు ఐదుసార్లు టైటిల్స్ అందించాడు. 2023లో కూడా సీఎస్‌కేను ఛాంపియన్‌గా నిలబెట్టడం ధోనీ నాయకత్వ పటిమకు నిదర్శనం. ధోనీ వారసత్వం కేవలం ట్రోఫీలు, పరుగులకు మాత్రమే పరిమితం కాదు. ఎంతటి ఒత్తిడిలోనైనా ప్రశాంతంగా ఉంటూ నిర్ణయాలు తీసుకోవడం అతని ప్రత్యేకత. అందుకే అభిమానులు ముద్దుగా 'కెప్టెన్ కూల్' అని పిలుచుకుంటారు. ఆరేళ్లు గడిచినా, ఇప్పటికీ ఆగస్ట్ 15న రాత్రి 7:29 గంటలు అయిందంటే కోట్లాది మంది అభిమానుల గుండెల్లో మహీ జ్ఞాపకాలు మెదులుతూనే ఉంటాయి.

# శ్రీలంక సిరీస్ తర్వాత అగార్కర్ భవిష్యత్తుపై బీసీసీఐ కీలక నిర్ణయం!




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టు సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ భవిష్యత్తుపై బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. శ్రీలంకతో టెస్టు సిరీస్ ముగిసిన తర్వాత బీసీసీఐ పెద్దలు అగార్కర్‌తో సమావేశం కానున్నట్లు ఓ నివేదిక వెల్లడించింది. సెప్టెంబరుతో సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా అగార్కర్ మూడేళ్ల పదవీకాలం పూర్తవుతుంది. దీంతో మరో ఏడాది పొడిగింపు ఇవ్వాలా? వద్దా? అన్నదానిపై ఈ భేటీలో చర్చ జరిగే అవకాశం ఉంది. అగార్కర్ భవిష్యత్తుపై చర్చకు మరో అంశం కూడా కారణమవుతున్నట్లు సమాచారం. రోహిత్ శర్మ భవిష్యత్తుపై సెలెక్టర్లు, బీసీసీఐ మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇంగ్లాండ్‌తో జులైలో జరిగిన వన్డే సిరీస్ తర్వాత రోహిత్‌ను జట్టు నుంచి తప్పించే ఆలోచన ఉందని సెలెక్టర్లు అతడికి తెలిపినట్లు నివేదిక పేర్కొంది. అయితే బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాత్రం రోహిత్ జట్టు ప్రణాళికల్లో ఉన్నంతకాలం దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూనే ఉంటాడని వ్యాఖ్యానించారు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని రోహిత్ భవిష్యత్తును ప్రతి సిరీస్ తర్వాత సమీక్షించాలని బీసీసీఐ కోరుకుంటున్నట్లు సమాచారం. అయితే సైకియా చేసిన వ్యాఖ్యలు సెలెక్టర్లకు అసంతృప్తి కలిగించినట్లు నివేదిక వెల్లడించింది. ఈ నేపథ్యంలో అగార్కర్‌తో జరగనున్న సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. సెలక్షన్ కమిటీ పనితీరు, భవిష్యత్ ప్రణాళికలతో పాటు రోహిత్ అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది.

ఇంగ్లాండ్‌తో చివరి వన్డేలో రోహిత్ శర్మ అద్భుత శతకంతో తనపై వస్తున్న విమర్శలకు బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చాడు. లార్డ్స్‌లో జరిగిన మ్యాచ్‌లో 138 పరుగులతో చెలరేగాడు. లార్డ్స్‌లో వన్డే శతకం సాధించిన తొలి భారత బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. శుభ్‌మన్ గిల్‌తో 147 పరుగుల భాగస్వామ్యం, విరాట్ కోహ్లీతో 113 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు.

# సంక్రాంతి ఓకే.. మరి భోగి సంగతేంటి శర్వా?

శర్వానంద్ హీరోగా తెరకెక్కుతున్న 'భోగి'ని ఆగస్టు 28న విడుదల చేస్తామని గతంలో అధికారికంగా అనౌన్స్ చేశారు. అయితే రిలీజ్ సమయానికి కేవలం రెండు వారాలు మాత్రమే మిగిలి ఉండటంతో అసలు సినిమా చెప్పిన తేదీకి వస్తుందా లేదా అనే ప్రశ్నలు మొదలయ్యాయి. పాన్ ఇండియా స్థాయిలో ప్లాన్ చేసిన భారీ చిత్రానికి ఈ సమయానికి పబ్లిసిటీ ఓ రేంజ్ లా నడవాలి. కానీ మేకర్స్ నుంచి ఎలాంటి పెద్ద ప్రమోషనల్ అప్‌డేట్స్ సౌండ్ అయితే లేదు. దర్శకుడు సంపత్ నంది రీసెంట్ గా ఒక భారీ యాక్షన్ షెడ్యూల్ పూర్తి చేసుకున్నామని సోషల్ మీడియాలో పేర్కొన్నాడు. అయితే ఆ పోస్ట్‌లో రిలీజ్ డేట్ గురించి ఎలాంటి ప్రస్తావన తీసుకురాలేదు. ఇప్పటికే ఈ చిత్రం కోసం 800 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులతో ఏకంగా 22 రోజుల పాటు ఒక భారీ క్లైమాక్స్ యాక్షన్ ఎపిసోడ్‌ను పూర్తి చేశారు. ప్రొడక్షన్ పనులు చురుగ్గానే సాగుతున్నా, థియేటర్లలోకి రావాల్సిన తేదీ దగ్గర పడుతుండటంతో ఆడియన్స్‌లో మాత్రం సస్పెన్స్ కొనసాగుతోంది. 1960ల నాటి తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాలో శర్వానంద్ 'గంగా' అనే సరికొత్త రగ్గడ్ పాత్రలో కనిపించబోతున్నాడు. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి ఇందులో హీరోయిన్లుగా నటిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేయాలనే ప్లాన్ ఉండటంతో సరైన బజ్ రావాల్సిన అవసరం కనిపిస్తోంది. ఇదిలా ఉంటే, శర్వానంద్ తన తర్వాతి ప్రాజెక్ట్‌ను మాత్రం చాలా వేగంగా లైన్‌లో పెట్టేశాడు. శ్రీను వైట్ల దర్శకత్వంలో రూపొందనున్న 'జార్జ్ క్రిష్' సినిమాను రీసెంట్‌గా ప్రారంభించారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 14న సంక్రాంతి పండుగ బరిలో నిలపబోతున్నట్లు ముందే పక్కాగా ప్రకటించారు. ఫెస్టివల్ సీజన్‌ను టార్గెట్ చేస్తూ రిలీజ్ డేట్ విషయంలో చిత్ర యూనిట్ చాలా ప్లానింగ్‌తో ఉంది. ఈ రెండు కథలు కూడా ఒకదానితో ఒకటి అస్సలు సంబంధం లేని పూర్తి భిన్నమైన జోనర్లు. ఒకవైపు యాక్షన్, రా లుక్‌తో సాగే పాన్ ఇండియా పీరియడ్ సినిమా చేస్తుంటే, వెంటనే మరోవైపు కుటుంబ ప్రేక్షకులను నవ్వించే పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌ను సెట్ చేసుకున్నాడు. ఒక నటుడిగా ఇలాంటి వైవిధ్యమైన లైనప్ సెట్ చేసుకోవడం ఆయన కెరీర్‌కు మంచి ప్లస్ పాయింట్. అయితే వచ్చే ఏడాది సంక్రాంతి సినిమాకు పక్కా డేట్ ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి చేతిలో ఉన్న 'భోగి' పరిస్థితిపైనే అందరి కళ్లు ఉన్నాయి. అధికారికంగా తేదీ మారలేదు కాబట్టి చెప్పిన సమయానికే వస్తుందా లేక కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తారా అనేది చిత్ర యూనిట్ తేల్చాల్సి ఉంది. పండుగ రేసును ముందే లాక్ చేసుకున్న శర్వా, ఈ పీరియడ్ డ్రామాతో ఎప్పుడు బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తాడో చూడాలి.



'టాక్సిక్' మ్యూజిక్ లాంచ్ ఈవెంట్‌లో ఆకర్షణీయమైన పసుపు రంగు దుస్తుల్లో మెరిసిపోయిన రుక్మిణి వసంత్






బాక్సింగ్ స్ఫూర్తితో సోనమ్ బాజ్వా బోల్డ్ లుక్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965